

సంక్రాంతిలోపు పరిష్కరించకుంటే రాష్ట్ర బంద్...

- వామపక్షాల, కాంగ్రెస్, జనసేన హెచ్చరిక
- అంగన్వాడీలకు మద్దతుగా కలెక్టరేట్ ముట్టడి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సంక్రాంతి లోగా అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర బంద్ చేపడుతామని, వామపక్ష, కాంగ్రెస్, జనసేన నేతలు హెచ్చరించారు. గత నెల రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం కనీసం పరిష్కరించేందుకు దృష్టి సారించకపోవడం దుర్మార్గమని సిపిఎం, సిపిఐ, సిపిఐఎల్ న్యూడెమోక్రసీ ,కాంగ్రెస్, జనసేన, పార్టీ నేతలు పేర్కొన్నారు. అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా శుక్రవారం ఆయా పార్టీలు కలెక్టరేట్‌ను ముట్టడించాయి. కలెక్టరేట్ గేట్లు తెర్చుకుని లోపలికి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కొంతసేపు పోలీసులకు, నాయకులు మధ్య వాగ్వివాదం చోటు చేసుకున్నది. కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సిపిఎం, సిపిఐ నగర కార్యదర్శిలు రాజశేఖర్,రామకష్ణారెడ్డి, అధ్యక్షతన జరిగిన కార్యక్రమానుద్దేశించిన సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి, సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య మాట్లాడుతూ 31 రోజుల నుండి సమ్మె చేస్తుంటే వారిని అనేక రకాల అవమానపాలు చేస్తూ, నిర్బంధాలు ప్రయోగిస్తూ, పోలీసులను ఉసిగొలుపుతూ బలవంతంగా వారి సెంటర్లను తెరిపించే ప్రయత్నం చేయడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. ఏస్మా చట్టాన్ని ప్రయోగించి అంగన్వాడి కార్మికులను భయభ్రాంతులకు గురి చేయడం అంగన్వాడీ వర్కర్ల వెంట రాష్ట్రంలో ఉన్న కార్మిక సంఘాలు వామపక్ష పార్టీలు ఉన్నాయన్నారు. విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని వారు తెలిపారు. జగన్ జగన్మోహన్ రెడ్డి గతంలో తాను అంగన్వాడీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. అంగన్వాడీలకు వేతనాలు పేరుతే ఈ రాష్ట్ర ప్రభుత్వానికి కేవలం రూ.350 కోట్ల రూపాయలు భారం మాత్రమే పడుతుందని, ఆ భారం కూడా భరించలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందా అని వారు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తాను పబ్లిసిటీ కోసం పెట్టే ఖర్చును తగ్గించుకుంటే అంగన్వాడీ జీతాలు పెంచవచ్చని తెలిపారు. రాబోయే కాలంలో మంత్రులు ఎమ్మెల్యేలు ఎంపీలు బయట తిరగలేరని, వారిని ఇళ్లలోనే నిర్బంధిస్తామని, ఆ రకంగా ప్రజానీకాన్ని సమీకరించి ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు జాన్ విల్సన్ , ఎస్‌యుసిఐ నాయకులు నాగన్న, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు భాస్కర్, జనసేన నాయకులు హసీనా బేగం తదితరులు మాట్లాడుతూ ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బేసిజాలకు పోకుండా అంగన్వాడీ యూనియన్లతో చర్చలు జరిపి వేతనాలు పెంచి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రామకృష్ణ, కెవి.నారాయణ, సిపిఎం నగర న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడుచ, ఎన్.అలివేలు, నగేష్, విజయ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. అంజిబాబు, పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఇ.పుల్లారెడ్డి తదితర ప్రజాసంఘాల నాయకులు, సిపిఐ నాయకులుమునెప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు..



కర్నూలు నగరంలో ప్రదర్శన చేపడుతున్న వామపక్ష నాయకులు

ఎయిడ్స్ రహిత సమాజం అవసరం



అల్పాహార విందులో పాల్గొన్న కలెక్టర్ సృజన

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎయిడ్స్ రహిత సమాజం నిర్మించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హెచ్‌ఐవి బాధితులతో కలెక్టర్ అల్పాహార విందులో పాల్గొన్నారు. వారితో కలిసి కలెక్టర్ సహపంక్తిలో అల్పాహారం తీసుకోవడం విశేషం. ఈ కార్యక్రమం లో పాల్గొని ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష వద్దు అనే సందేశాన్ని సమాజానికి అందించారు. కర్నూలు నగర మేయర్ బివై.రామయ్య కూడా పాల్గొన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు కూడా మనతో సమానమని తెలిపేందుకు వారితో కలిసి అల్పాహారం చేయడమే ఇందుకు నిదర్శనం అన్నారు. ఈ అల్పాహార ఏర్పాటుకు ముందుకు వచ్చిన ఎన్‌జిఒ నాగరాజును జిల్లా కలెక్టర్ అభినందించారు. డిఆర్ఒ మధుసూదన్ రావు, జిల్లా లెప్రసి,ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి ఎల్.భాస్కర్, ఐసిడిఎస్ పిడి వెంకటలక్ష్మి, మైనారిటీ సంక్షేమ అధికారి సభిహాపర్వీన్, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ మల్లికార్జునరెడ్డి, దాతవిష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

జన భగీధరి కార్యక్రమాలు విజయవంతం

సామాజిక సమతా సంకల్పం(జన భగీదరి) పేరుతో జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఉన్నటువంటి అర్బన్ లోని 211 సచివాలయాల్లో, రూరల్ లోని 461 సచివాలయాల్లో అనగా మొత్తం 672 సచివాలయాల్లో సామాజిక సమతా సంకల్పం(జన భగీదరి) కార్యక్రమాలను నిర్వహించామన్నారు. సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో దాదాపు 6,181 మంది పౌరులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించారన్నారు. ఈనెల 18న జిల్లా స్థాయిలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నమన్నారు.

సాధారణ ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లకు

ఆర్‌యులో భవనాల పరిశీలన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సాధారణ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లలో భాగంగా రాయలసీమ యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్ ల ఏర్పాటు కొరకు భవనాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్‌పి జి.కృష్ణకాంత్ శుక్రవారం పరిశీలించారు. సాంకేతిక శాస్త్ర కళాశాల బ్లాక్, లైఫ్ సైన్స్ బ్లాక్, అకాడమిక్ బ్లాక్ 4, ఓల్డ్ లైబ్రరీ, నూతన లైబ్రరీ తదితర భవనాలన్నీ కలియ తిరిగి క్షుణ్ణంగా పరిశీలించారు. 8 నియోజకవర్గాల వారీగా 8 రిసెప్షన్ సెంటర్లు వివిధ బ్లాక్‌లలో ఏర్పాటు చేసినప్పుడు ఆయా నియోజకవర్గాల సిబ్బందికి గందరగోళం లేకుండా ఏ నియోజక వర్గానికి ఏ బ్లాక్, ఏ ఫ్లోర్ కేటాయించారని సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.. కౌంటింగ్ హాల్‌కు 2 ద్వారాలు ఉండే విధంగా చూసుకోవాలని, పోలింగ్ ఏజెంట్స్, ఇవిఎం మిషన్లు కలిసిపోకుండా బ్యారికేడ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. సెక్యూరిటీ పరంగా తీసుకోవలసిన చర్యల గురించి కూడా కలెక్టర్, ఎస్‌పి పరిశీలించారు. జెసి నారపు రెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఒ మధుసూధనరావు, పత్తికొండ ఆర్‌డిఒ రామలక్ష్మి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



యూనివర్శిటీ భవనాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

కార్పొరేట్ చేతుల్లోకి విద్య...

- ప్రాథమిక విద్యకు నిధుల కోత - మాతృభాషలోనే బోధన
- సామాజిక అంశాలను బోధించాలి - సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి.రమణ
- ఎస్‌టియు వజ్రోత్సవ వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ప్రస్తుతం విద్య కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లిందని సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి.రమణ పేర్కొన్నారు. పాలక ప్రభుత్వాలు ప్రాథమిక విద్యకు ఇటీవల కాలంలో నిధుల కోత పెట్టాయన్నారు. ప్రతి ఒక్కరికి విద్య అందినప్పుడే సమాజం అభివద్ధి పథంలో నడుస్తుందని పేర్కొన్నారు. ఎస్‌టియు వజ్రోత్సవ వేడుకలు శనివారం కర్నూలు నగరంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కర్నూలు ఎగ్జిబిషన్ గ్రౌండ్ మైదానంలో జరిగిన వేడుకలకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఎన్‌వి.రమణ, సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, జాతీయ సమితి నాయకులు చాడ వెంకటరెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ముందుగా శ్రీకృష్ణదేవరాయ సర్కిల్ నుండి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్‌వి.రమణ మాట్లాడుతూ దేశంలో1.20 లక్షల ఏకోపాధ్యాయ పాఠశాలలు నడుస్తున్నాయన్నారు. దాదాపుగా 11 లక్షల పైగా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కాలేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ ఐదో తరగతి చదివే పిల్లలకు రెండు అంకెల లెక్కలు కూడా చేయడానికి రాకపోవడం శోచనీయమన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో రెండు కార్పొరేట్ విద్యాసంస్థల్లో నడుస్తున్న విద్యా బోధన సమాజానికి అభివృద్ధి చెందేలా లేదన్నారు. కేవలం యాంత్రిక బోధన మాత్రమే కొనసాగుతుందని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో విద్యాబోధన ఇంగ్లీష్ మీడియం పేరుతో కొనసాగుతుందన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఇప్పటికీ వారి మాతృభాషలోనే సాంకేతిక విద్య కొనసాగుతుందన్నారు. మనదేశంలో మాతృభాషలోనే విద్యా బోధన అందించేలా ప్రభుత్వాలు దృష్టి సారించాలని, ఉపాధ్యాయు వేమన, సుమతి శతకంలోని పద్యాలను విద్యార్థులతో చదివించాలన్నారు. విద్యను సద్వినియోగం చేసి జాతీ నిర్మాణానికి తోడ్పడాలన్నారు. మూఢనమ్మకాలను అనుసరించే విద్య ఉండకూడన్నారు. గతంలో వామపక్ష ఐక్య ఉద్యమాల ద్వారానే అనేక సమస్యలకు పరిష్కారం దొరికేదన్నారు. ఇటీవల కాలంలో దేశంలో అలాంటి ఒరవడి కొనసాగడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రధాన సమస్యలపై ఉమ్మడి ఐక్య కార్యాచరణతో ముందుకు సాగితే అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని సూచించారు. మార్క్స్ సిద్ధాంతం ఏదైతే చెప్పిందో అదే ఇప్పుడు జరుగుతుందన్నారు. ఈ సిద్ధాంతమే సమాజం మార్పుకు దిక్సూచి చని పేర్కొన్నారు.

వామపక్ష ఐక్య కార్యాచరణ జరగాలి

గతంలో వామపక్ష ఐక్య ఉద్యమాల ద్వారానే అనేక సమస్యలకు పరిష్కారం దొరికేదన్నారు. ఇటీవల కాలంలో దేశంలో అలాంటి ఒరవడి కొనసాగడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రధాన సమస్యలపై ఉమ్మడి ఐక్య కార్యాచరణతో ముందుకు సాగితే అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని సూచించారు. ఇటీవల కాలంలో ప్రపంచంలో నెలకొన్న ఆర్థిక మాంద్యం వల్ల అనేక సమస్యలు నెలకొన్నాయన్నారు. మార్క్స్ సిద్ధాంతం ఏదైతే చెప్పిందో అదే ఇప్పుడు జరుగుతుందన్నారు. ఈ సిద్ధాంతమే సమాజం మార్పుకు దిక్సూచి చని పేర్కొన్నారు.

హిందుత్వ భావజాలం బోధన తగదు: సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో హిందుత్వ భావజాల బోధనను పాలకులు అనుసరిస్తున్నాయన్నారు. విద్యార్థులకు బోధించే పాఠ్యాంశాలలో రామాయణం, మహాభారతం వంటి వాటిని చేర్చారన్నారు. ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేబోధన పద్ధతులను పాఠశాలలో కొనసాగడం లేదన్నారు. పాఠశాలల్లో అనేక ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకువచ్చి పటిష్టమైన విద్యాబోధన జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ప్రభుత్వ పాఠశాల విద్యను కాపాడుకోవాలి : యుటిఎఫ్

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కోసం ఉపాధ్యాయ సంఘాలు పోరాడాలన్నారు. ప్రభుత్వ విద్యారంగ ప్రయివేటీకరణ చేసే పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తేలా ఉద్యమాలుండాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ఒపిఎస్ అమలు చేసే పార్టీలకు ఉపాధ్యాయులు మద్దతు పలకాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఐక్య కార్యాచరణ ఉద్యమాలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు.



కర్నూలు నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌టియు నాయకులు

పలువురు వక్తలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న విధానాలపై సమరశీల పోరాటాలు కొనసాగించాలని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయడమే కాకుండా ఉపాధ్యాయుల సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోకారి, జనార్ధన్ ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు హృదయరాజు, ఆంధ్రప్రదేశ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంఘం పూర్వపు రాష్ట్ర అధ్యక్షులు ఓంకార్ యాదవ్, తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.



వజ్రోత్సవ సభలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న పిడి.అమర్‌నాథ్‌రెడ్డి

ప్రతికూలి ఉపాధి పనులను వినియోగించుకోవాలి

వలసలు వెళితే సిబ్బందిపై చర్యలు: పిడి అమర్నాథ్ రెడ్డి

ప్రజాశక్తి -తుగ్గలి


గ్రామాలలో ఉన్న ప్రతి కూలి జాతీయ ఉపాధి హామీ పథకం పనులను వినియోగించుకోవాలని డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం తుగ్గలిలో 17వ రౌండ్ సోషల్ ఆడిట్ ను ఆయన నిర్వహించారు. పిడి మాట్లాడుతూ వలసలు వెళ్లకుండా ఆ గ్రామంలోనే పనులు చేసుకోవాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఏ ఒక్క కూలి సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్ళకూడదని అన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పనులు కల్పించాల్సిన బాధ్యత ఉపాధి సిబ్బందిపై ఉందన్నారు. గ్రామాలలో వలసలు వెళితే ఆ గ్రామానికి చెందిన టిఎం,ఎఫ్ఎల పై చర్యలు తీసుకుంటామన్నారు. 2023-24న తుగ్గలి మండలంలో దాదాపు రు.26 కోట్ల మేర వివిధ రకాల పనులను కల్పించామన్నానరు. దానికి సంబంధించిన ఆడిటును నిర్వహించామన్నారు. ఎంపిడిఒ సావిత్రి, ఎపిఒ రామకృష్ణ, ఇసి ప్రదీప్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో రు.95వేలు రికవరీ

జాతీయ ఉపాధి హామీ పథకంలో నిర్వహించిన సామాజిక తనిఖీలో అన్ని గ్రామ పంచాయతీలకు కలిపి రు.95 వేలు రికవరీలకు ఆదేశించినట్లు పిడి అమర్నాథరెడ్డి తెలిపారు. ఇప్పటికే సగం దాకా రికవరీని కట్టించామని మిగిలిన రికవరీలను వెంటనే చెల్లించాలని ఎపిఒను ఆదేశించామన్నారు

అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి

ప్రజాశక్తి -పత్తికొండ



కర్నూలు జిల్లా ఆదోని ఇంద్రానగర్ కు చెందిన ఎరుకల రాముడు శుక్రవారం పత్తికొండ పట్టణంలోని ఆదోని రోడ్డులోని సిద్ధం ఫిల్లింగ్ స్టేషన్ వెనుకవైపు మృత్యువై స్థానికులకు కనపడ్డాడు. విషయం తెలుసుకున్న అర్బన్ సిఐ మురళీమోహన్ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పరిశీలించారు. సిఐ మురళీమోహన్ మాట్లాడుతూ ఆదోని ఇంద్రానగర్ కు చెందిన ఎరుకల రాముడు కుటుంబ కలహాల కారణంగా భార్యతో గొడవపడి తనకు ఉన్న సొంత ఆటోలోనే ఉరి వేసుకున్నాడని విలేకరులకు తెలిపారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆటోకు ఉరి వేసుకోవడమేమిటని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎవరో హత్యచేసి ఇక్కడ వేలాడదీసినట్లు కనబడుతుందని అంటున్నారు.

32వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

అంగన్వాడీల సమ్మె శుక్రవారంతో 32వ రోజు చేరింది. ప్రభుత్వం తమ జీవితాలతో చెలగాటమడుతున్నదని సంక్రాంతి తర్వాత తాము ఇక తాడోపేడో తేల్చుకోవడమే తమ ముందున్న కర్తవ్యమని అంగన్వాడి నాయకులు తెలిపారు. దీక్షా శిబిరానికి ఎస్టియు ,సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ న్యూ డెమోక్రసీ, జనసేన, ఎస్‌యుసిఐ పార్టీలు మద్దతు తెలిపాయి. కర్నూల్ ధర్నా చౌక్ లో జరుగుతున్న సమ్మె శిబిరంలో కోడుమూరు అంగన్వాడీలు మద్దతుగా 24 గంటల దీక్షల్లో పాల్గొన్నారు. అంగన్‌వాడీల జిల్లా గౌరవాధ్యక్షులు పి.నిర్మల, సిఐటియు కోడుమూరు నాయకులు ఎస్.గఫూర్ మియా మాట్లాడుతూ తాము సిఐటియు అండతో ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా భయపడటం లేదన్నారు. మనోధైర్యంతో సమ్మెను కొనసాగించాలని సూచించారు. నోటీసులు,పోలీసుల బెదిరింపులు, ఎస్మాలాంటి లాంటి చట్టాలను ప్రయోగించడం దుర్మార్గమన్నారు. సమస్యలు పరిష్కార మయ్యేంత వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఆమరణ దీక్షలకు కూడా పూనుకొని బలిదానాలకు కూడా వెనకాడమని అంగన్వాడీలు తెలిపారు. దీక్షా శిబిరంలో పెద్దపాడు సెక్టార్ అంగన్వాడీలు కె. అనంతమ్మ, పుష్పలత, అరుణాదేవి, ఎ. విజయలక్ష్మి, పి.కృష్ణవేణి, ఏ సాలమ్మ, హేమలత, తిరుపతమ్మ, తులసి, ఫాతిమా, రాఘవేంద్రమ్మ, హైమావతి, సోనీ ,భారతి, మాధమ్మ, మద్దమ్మ, రాములమ్మ, మహాలక్ష్మి, చాంద్‌బీ, కె.రాములమ్మ, అరుణ, జ్యోతి కూర్చున్నారు. అంగన్వాడీల జిల్లా అధ్యక్షులు బి రేణుక అరుణ సిఐటియు జిల్లా కార్యదర్శి ఎంజి.అంజి బాబు, నాయకులు ఎం.గోపాల్, సిఐటియు నగర నాయకులు కె ప్రభాకర్, కె సుధాకరప్ప, కర్నూలు నగర సిఐటియు ఉపాధ్యక్షులు ఎస్.మహమ్మద్ రఫి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప. నగర కార్యదర్శి ఎం. చంద్రశేఖర్. నాయకులు రామాంజనేయులు నాయకత్వం వహించారు. అంగన్వాడీ దీక్ష శిబిరం దగ్గర కోలాటం కబడ్డీ ఆడుతూ ప్రభుత్వానికి తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు.



ధర్నాచౌక్‌లో అంగన్‌వాడీల సమ్మెనుద్దేశించి మాట్లాడుతున్న పి.నిర్మల

వెల్దుర్తి : ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్‌వాడీల 32వ రోజు నిరవధిక సమ్మెకు మద్దతుగా సిఐటియు జిల్లా కార్యదర్శి జె.నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సహనాన్ని పరీక్షిస్తుందని, మునుముందు సమ్మె ఉగ్రరూపం దాల్చకముందే వారి డిమాండ్లను నెరవేర్చాలని హెచ్చరించాడు. ఎఐటియుసి మండల కార్యదర్శి మాధవస్వామి ఆధ్వర్యంలో క్రిష్ణగిరి వెల్దుర్తి ఆశ వర్కర్లు సంఘీభావం తెలిపారు. సంక్రాంతి గొబ్బెమ్మల ముగ్గు రూపంలో రూ.26 వేల గ్రాడ్యుయేట్ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని.ఎస్మా చట్టాన్ని షోకేస్ నోటీసుని రద్దు చేయాలని ముగ్గుల రూపంలో నిసన తెలిపారు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుప్రంకోర్టు మాజీ సిజె ఎన్‌వి.రమణ

'మాతానీవు లేని జీవితం' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి -కర్నూలు కల్చరల్

ఎస్‌టియు వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా ముఖ్య అతిథిగా కర్నూలుకు వచ్చిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి. రమణ చేతుల మీదుగా జిల్లాకు చెందిన పుల్లారామాంజనేయులు రాసిన పుస్తకం మాతా నీవులేని జీవితం ఆవిష్కరించారు. ఒత్తులు లేని తొలి తెలుగు బాలల ఫాంటసీ నవల అని రచయిత ఆయనకు వివరించారు. ఈ నవల ఆరంభం నుండి ముగింపు దాకా సస్పెన్స్‌తో నడుస్తుందని అడవిరాజ్యం, సమాజం, బడి చుట్టు నవల కథాంశం తిరుగుతుందని కథాంశాన్ని సీజేకు వివరించారు. జంతువులు, పక్షులే పాత్రలుగా కవితలు, కథలు, గేయాలు, నాటకం, సంఘటనలు, పదాలాట, ప్రక్రియలు ఉన్నాయన్నారు. ఆవిష్కరణలో ఎస్‌టియు రాష్ట్రనాయకులు పాల్గొన్నారు.

విశ్వాసం లేని వ్యక్తి సంజీవ్ కుమార్ : వైసిపి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వైసిపి ఎంపీగా ఐదేళ్లు పదవి అనుభవించి ఇప్పుడు విమర్శలు చేసే డాక్టర్ సంజీవ్‌కుమార్ విశ్వాసం లేని వ్యక్తి అని వైసిపి జిల్లా అధ్యక్షుడు బివై.రామయ్య, ఎమ్మెల్యే సుధాకర్ విలేకరుల సమావేశంలో విమర్శించారు. పదవిలో ఉండి నిన్నదిదాకా మాట్లాడిన మాటలేమిటి, ఇప్పుడు చెబుతున్నదేమిటి , నిజానిజాలు మీకు తెలియదా అని ప్రశ్నించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బివై.రామయ్య

నేటి యువతకు వివేకానందుడు ఆదర్శం : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : స్వామి వివేకానందుని జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. శుక్రవారం రాజ్‌విహార్ సెంటర్ లో జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధికంగా యువత ఉన్న దేశం మనదే అని దేశాభివృద్ధిలో యువత పాత్ర చాలాకీలకమన్నారు. వివేకానందుని స్ఫూర్తిగా తీసుకొని దేశాభివృద్ధికి యువత పాటుపడాలన్నారు. కలెక్టర్



సెట్కూరు సిఇఒ పివి రమణ, రిటైర్డ్ డాక్టర్ మోక్షేశ్వరుడు, రవీంద్ర విద్యాసంస్థ అధినేత జి.పుల్లాయ్య వివిధ విద్యాసంస్థల అధినేతలు పాల్గొన్నారు.


వివేకానందుడికి ఎమ్మెల్యే ఘన నివాళి

కర్నూలు క్రైమ్: కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ.హఫీజ్ ఖాన్ స్వామి వివేకానంద జయంతి సందర్భంగా రాజవిహార్ సర్కిల్‌లోని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ యువతకు స్ఫూర్తి ప్రదాత, మార్గదర్శి, భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచ నలుదిశలా చాటిన చైతన్యమూర్తి స్వామి వివేకానంద అన్నారు. వైసిపి ముఖ్యనాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రాష్ట్రంలో జగన్ పతనం ఖాయం

నందికొట్కూరు కన్వీనర్ గౌరు వెంకటరెడ్డి

ప్రజాశక్తి-కర్నూల్ హాస్పిటల్



టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రంలో స్వర్ణయుగం రానున్నదని, రానున్న ఎన్నికల్లో భస్మాసురుడు జగన్ పాలనకు స్వస్తి పలికేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని పాణ్యం మాజీ ఎమ్మెల్యే పాణ్యం ఇంచార్జి గౌరు చరిత రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ మాధవి నగర్ లోని వారి స్వగహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ జగన్ పాలనపై ప్రజలతో పాటు సొంత పార్టీ ఎమ్మెల్యేలు సైతం ధిక్కారస్వరం వినిపిస్తున్నారన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికి చేసిన మేలు ఏమీ లేదని, విధ్వంసం, అరాచకం దౌర్జన్యం ,దోపిడి మాత్రమే అన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కూటమి సృష్టించబోతున్న సునామీలో వైసిపి గల్లంతవ్వడం ఖాయమన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో అన్ని సీట్లు గెలవబోతున్నామని ధీమా వ్యక్తం చేసారు. భవిష్యత్తులో టిడిపి అధికారంలోకి రాగానే భారీ పెట్టుబడులు రాష్ట్రానికి వస్తాయని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే బాధ్యత టిడిపి, జనసేన ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు.

టిడిపి కల్లూరు అర్బన్ అధ్యక్షునికి పెరుగుపురుషోత్తం రెడ్డి

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజారపు అచ్చం నాయుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే టిడిపి ఇన్చార్జ్ గౌరు చరిత రెడ్డి ఆదేశాల మేరకు కల్లూరు అర్బన్ 16 వార్డు అధ్యక్షులుగా పెరుగు పురుషోత్తం రెడ్డిని, ఉపాధ్యక్షులుగా పెద్దపాడు పెద్ద బీచుపల్లిని ఎన్నుకూన్నారు. వారికి గౌరు చరిత, వెంకట రెడ్డి దంపతులు నియామక పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

'నవరత్నాలు' పేదలకు వరం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆదోని



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలు పేదలకు వరం లాంటివని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆదోనిలోని 32వ వార్డులో 'ఎపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రతి కుటుంబం రూ.3 లక్షల మేర లబ్ధి పొందిందన్నారు. అవినీతి రహిత పాలన అందిస్తూ ఏ ముఖ్యమంత్రి చేపట్టలేని పథకాలను ప్రజలకు అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మున్సిపల్ ఛైర్మన్ శాంత, వైసిపి పట్టణ అధ్యక్షులు బి.దేవా, సిఐ తేజ మూర్తి, స్టేట్ డైరెక్టర్లు రేణుక, మంజుల, వార్డు కౌన్సిలర్ కీర్తన, కిషోర్, వైస్ ఛైర్మన్ నరసింహులు, కౌన్సిలర్ సురేష్, రామకృష్ణ, ఫయాజ్, చంద్రకాంత్ రెడ్డి, రామలింగేశ్వర యాదవ్, నాగరాజు, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఈరప్ప, పూజారి శీను, బోరింగ్ గుండప్ప, బజారి, వికె.వెంకటేష్, డేంజర్ అంజిని, గిడ్ అంజిని, కాలు బాష, మా బాష, ప్రహ్లాద్, పెద్ద అంజి, హరికృష్ణ, శ్రీలక్ష్మి, మల్లిక, కల్పవల్లి, నాల్గిండ్ల లక్ష్మీనారాయణ ఉన్నారు.

ఆదర్శప్రాయుడు మైనేని : యుటిఎఫ్

ప్రజాశక్తి - గోనెగండ్ల



నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉపాధ్యాయ ఉద్యమాన్ని సమైక్యపరచి ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేసి మార్గదర్శకత్వం వహించిన ఆదర్శప్రాయుడు మైనేని వెంకటరత్నం అని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.నరసింహులు మండల అధ్యక్ష, కార్యదర్శులు మద్దిలేటి, చంద్రపాల్ తెలిపారు. శుక్రవారం గోనెగండ్లలోని బస్టాండ్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత, ఐక్య ఉపాధ్యాయ పత్రిక సంపాదకుడు మైనేని వెంకటరత్నం వర్ధంతిని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ... వెంకటరత్నం యుటిఎఫ్ ఏర్పాటులో కీలకపాత్ర వహించడంతో పాటు ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించి చైతన్యం పరిచేందుకు ఐక్య ఉపాధ్యాయ మాస పత్రికను ఏర్పాటు చేశారని తెలిపారు. నాగేశ్వరరావు, రామన్, జిక్రియా, నాగరాజు, ఖలీల్ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' కాదు..

ప్రజలే మార్చుకుందాం ఆంధ్ర అంటున్నారు - టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం



మాట్లాడుతున్న తిక్కారెడ్డి

వైసిపి ప్రభుత్వం చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' వల్ల ఉపయోగం శూన్యమని, 'ఆడుదాం ఆంధ్ర' కాదు.. మార్చుకుందాం ఆంధ్రగా ప్రజల్లో చైతన్యం వచ్చిందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. శుక్రవారం కోసిగి నుంచి కౌతాళం మండలం హాల్వి గ్రామం వరకు గుంతలమయమై అధ్వానంగా ఉన్న రోడ్డును చూసి, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో పాతాళానికి కూరుకుపోయిందని తెలిపారు. రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి దయనీయంగా మారిందని విమర్శించారు. కనీసం రోడ్లపై ఉన్న గుంతలను కూడా పూడ్చలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి ఏమాత్రం అభివృద్ధి చేయకుండా 'వై నాట్ 175' అనడం హాస్యాస్పదమని విమర్శించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని యువతను మరోసారి మోసం చేసేందుకే 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో రూ.వందల కోట్లు వైసిపి నాయకులకు దోచిపెట్టేందుకే చేపడుతున్నారని తెలిపారు.

పండగ కానుకల రద్దు దుర్మార్గం : టిడిపి

ప్రజాశక్తి - ఆదోని



సమస్యలు తెలుసుకుంటున్న గుడిసె ఆది కృష్ణమ్మ

సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ పండగల సందర్భంగా గత టిడిపి ప్రభుత్వం అందజేసిన కానుక పథకాలను ప్రస్తుత వైసిపి ప్రభుత్వం రద్దు చేయడం దుర్మార్గమని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ విమర్శించారు. శుక్రవారం ఆదోని రాజీవ్ గాంధీ నగర్‌లో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ' నిర్వహించి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. పెరిగిన నిత్యావసర ధరలు ఓవైపు, పండగల కానుకల రద్దుతో నిరుపేదల కుటుంబాల్లో పండగ సంతోషం లేకుండా పోయిందన్నారు. మాజీ ఎంపిపి మురళీ, గోపాల్, బాబురావు, లక్ష్మీకాంత్ రెడ్డి, రామయ్య, రవికుమార్, నాగేంద్ర, ముస్లిం, మైనార్టీ నాయకులు అల్తాఫ్, షేక్ జిలాని, భరత్, వీరేష్ పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడడం చేతగాని తనం

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు

ప్రజాశక్తి - మంత్రాలయం

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా బెదిరింపులకు పాల్పడడం ప్రభుత్వం చేతగానితనమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు విమర్శించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 32వ రోజుకు చేరింది. ముఖ్య అతిథులుగా రామాంజనేయులు హాజరయి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకుండా బెదిరించడం, భయాందోళనలకు గురిచేయడం సరైనది కాదన్నారు. తక్షణమే అంగన్వాడీల సమస్యలను పరిష్కరించి అంగన్వాడీలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఐసిడిఎస్ కార్యాలయం నుంచి రాఘవేంద్ర సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి, రాఘవేంద్ర స్వామి విగ్రహానికి పూలమాల వేశారు. తమ సమస్యలు పరిష్కరించేటట్లు ముఖ్యమంత్రి జగన్‌కు మంచి బుద్ధిని ప్రసాదించాలని అంగన్వాడీలు ప్రార్థించారు. సిఐటియు మండల కార్యదర్శి హెచ్.జయరాజు, నాయకులు ప్రాణేష్, అంగన్వాడీ యూనియన్ మంత్రాలయం ప్రాజెక్టు అధ్యక్షులు విశాలాక్షి, ఉపాధ్యక్షులు ప్రమీల, ద్రాక్షాయని, ఉమామహేశ్వరి, సుజాత, లావణ్య పాల్గొన్నారు. **ఆలూరులో** సిఐటియు ఆధ్వర్యంలో 32వ రోజు సమ్మె సందర్భంగా 32 ఆకారంలో కూర్చొని నిరసన చేపట్టారు. అంగన్వాడీలకు టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ వీరభద్రగౌడ్ మద్దతు తెలిపి మాట్లాడారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణస్వామి, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు జయశ్రీ, బాలరంగమ్మ, ప్రభావతి, సిపిఎం నాయకులు షాకీర్, కృష్ణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు భారతి, లక్ష్మీ, సరస్వతి, సుజాత, వెంకటలక్ష్మి పాల్గొన్నారు. **ఆస్పరిలో** సిఐటియు మండల గౌరవాధ్యక్షులు బాలకృష్ణ, ఎఐటియుసి మండల కార్యదర్శి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్ కుమారస్వామికి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం మండల కార్యదర్శి రంగస్వామి, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రవి, అంగన్వాడీ యూనియన్ నాయకులు జ్యోతి, ప్రమీల, విశ్వ కుమార్, బేగం, లత, దస్తగిరమ్మ పాల్గొన్నారు. **కోసిగిలో** అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎంఆర్‌పిఎస్ నాయకులు మద్దతు తెలిపారు. ఎంఆర్‌పిఎస్ మండల కన్వీనర్ సామ్యేల్ మాదిగ మాట్లాడుతూ... అంగన్వాడీల సమస్యలను పరిష్కరించమని అడిగితే, ఎస్మా చట్టాన్ని ప్రయోగించి బెదిరించడం సబబు కాదన్నారు. ఎస్మా చట్టాన్ని వెనక్కి తీసుకొని వారి డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండల అధ్యక్షులు వీరేష్, ఎంఆర్‌పిఎస్ నాయకులు దుర్గప్ప మాదిగ, నాగరాజు మాదిగ, ఈరన్న మాదిగ, ప్రకాష్ మాదిగ, చిదానంద మాదిగ, అంగన్వాడీ యూనియన్ నాయకులు లూసమ్మ, హెబ్సిబా రాణి, వరలక్ష్మి పాల్గొన్నారు. **పెద్దకడబూరులో** అంగన్వాడీలు విధుల్లోకి చేరాలని ప్రభుత్వం అందజేసిన నోటీసులను దహనం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన నోటీసులు అంగన్వాడీలు తీసుకోవడానికి నిరాకరించడంతో అధికారులు అంగన్వాడీ కేంద్రాలకు అంటించారు. దీనిపై ఆగ్రహించిన అంగన్వాడీలు నోటీసులను చించివేసి దహనం చేశారు. వీరికి సిఐటియు గౌరవాధ్యక్షులు తిక్కన్న, వ్యకాస నాయకులు హనుమంతు, పరమేష్, టిడిపి నాయకులు సిద్ధప్ప మద్దతు పలికారు. అంగన్వాడీ నాయకులు జయమ్మ, చిట్టెమ్మ, సుకన్య థెరిస్సమ్మ, రత్నమ్మ, నాగవేణి పాల్గొన్నారు. **ఎమ్మిగనూరులో** అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 32వ రోజుకు చేరింది. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు, ఎఐటియుసి తాలూకా కార్యదర్శి వి.తిమ్మగురుడు, ఐఎఫ్‌టియు తాలూకా కార్యదర్శి రాజు, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి గోవర్ధనమ్మ, నాయకులు నీరజ, నాగలక్ష్మి, వరలక్ష్మి, నాగేశ్వరమ్మ, శైలజ, కృష్ణవేణి, ప్రభావతి, తులసి, పుష్పవతి, రామేశ్వరి, నాగలక్ష్మి, గాయత్రి పాల్గొన్నారు.



కోసిగిలో మద్దతుగా దీక్షలో కూర్చున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

టిడిపితోనే బీసీలకు రాజ్యాధికారం

- మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - నందవరం



మాట్లాడుతున్న బీవీ

బీసీలకు రాజ్యాధికారాన్ని కట్టబెట్టింది కేవలం టిడిపినే అని మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు తెలిపారు. శుక్రవారం నందవరంలో 'జయహో బీసీ' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలుగు వారి ఆత్మ గౌరవం కోసం పుట్టిన టిడిపి అని, బీసీల అభివృద్ధికి కృషి చేస్తూ అండదండగా నిలిచిందని తెలిపారు. బీసీల కోసం పెట్టిన బస్సు యాత్రలో జగన్మోహన్ రెడ్డి బీసీలపై కపట ప్రేమను ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. దమ్ముంటే ఎమ్మెల్యే టిక్కెట్ తెచ్చుకొని పోటీ చేయాలని ఎర్రకోట చెన్నకేశవరెడ్డికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి సవాలు విసిరారు. టిడిపి సీనియర్ నాయకులు ఈరన్న గౌడ్, నాగరాజు గౌడ్, మాధవరావు దేశాయి, ఖాసీంవలీ, వెంకటరామిరెడ్డి, చిన్న రాముడు, గోపాల్, దావీదు, గజేంద్ర రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్, షరీఫ్, భార్గవ్ పాల్గొన్నారు.

టిడిపితోనే బీసీలకు న్యాయం

- టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ

ప్రజాశక్తి - చిప్పగిరి

రాష్ట్రంలో బీసీలకు సమ న్యాయం చేసిన పార్టీ ఏదైనా ఉందంటే అది ఒక్క టిడిపినేనని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ తెలిపారు. శుక్రవారం మాజీ జడ్‌పిటిసి మీనాక్షి నాయుడు, టిడిపి మండల కన్వీనర్ లాయర్ షేక్షావలీ ఆధ్వర్యంలో చిప్పగిరిలో 'జయహో బీసీ' నిర్వహించారు. సుజాతమ్మకు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. శాలువా, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బీసీల పట్ల వైసిపి కపట ప్రేమ నటిస్తోందని, కేవలం అధికారం కోసం బీసీలను వాడుకొని వదిలేసిందని విమర్శించారు. బీసీలకు పెద్దపీట వేసి రాజ్యాధికారం కల్పించిన పార్టీ టిడిపి అని తెలిపారు. కేవలం ఎన్నికల ముందు వైసిపికి బీసీలు గుర్తుకొస్తున్నారని విమర్శించారు. సంక్షేమం పేరుతో ముఖ్యమంత్రి జగన్ ముద్దుల మీద ముద్దులు పెట్టి చివరకి పిడి గుద్దులు గుద్దారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు సంక్షేమంతో పాటు అభివృద్ధిని కూడా కొనసాగించే సత్తా ఉన్న సీనియర్ నేత అని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉండి, అభివృద్ధిని కొనసాగించేందుకు చంద్రబాబు వస్తున్నారని అన్నారు. బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్, రఘు ప్రసాద్ రెడ్డి, సర్పంచులు సుశీలమ్మ, పురుషోత్తం, ఎంపిటిసి రజిని, సీనియర్ నాయకులు పాముల సన్నప్ప, మాజీ కన్వీనర్ కిష్టప్ప, తిమ్మయ్య, సంగాల భాస్కర్, సురేష్, అంపయ్య, నాగిరెడ్డి, ఉమాకాంత్ స్వామి, అంజి, శ్రీలక్ష్మి, అమ్రేష్, రామాంజిని, హరినాథ్, నరసింహులు పాల్గొన్నారు. **ఆలూరు** మండలం మొలగవల్లి గ్రామంలో మండల కన్వీనర్ అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో 'జయహో బీసీ' సభ నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ మాట్లాడారు. టిడిపి ప్రభుత్వ హయాంలో బీసీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు ఇచ్చి చంద్రబాబు నాయుడు అండగా నిలిచారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. టిడిపి బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు సత్రం రామకృష్ణుడు మాట్లాడుతూ... రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ బీసీలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. టిడిపి బీసీ రాష్ట్ర నాయకులు రాంనాథ్ యాదవ్, మనేకుర్తి రాజశేఖర్, మండల కన్వీనర్లు విజయ భాస్కర్, గౌడ్ షేక్షావలీ, తిప్పయ్య, సుధాకర్, జిల్లా నాయకులు నరసప్ప, భాస్కర్, కిషోర్, సోమ శేఖర్, నాగరాజు, కమ్మరచేడు దేవేంద్రప్ప, మద్దిలేటి యాదవ్, లక్ష్మి రెడ్డి, సర్పంచి రాజశేఖర్, ఎంపి.రంగన్న, ఆంజనేయ్య, ఈరప్ప యాదవ్, రంగస్వామి, కృష్ణ యాదవ్, తిమప్ప, టిసి.రంగన్న పాల్గొన్నారు.



చిప్పగిరి : 'జయహో బీసీ'లో మాట్లాడుతున్న కోట్ల సుజాతమ్మ

ప్రజల ఆశీస్సులతో సేవకునిగా పని చేస్తా

- వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ విరుపాక్షి

ప్రజాశక్తి-ఆలూరు

నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశీర్వాదంతో ప్రజాసేవకునిగా పని చేస్తానని వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ, చిప్పగిరి జడ్‌పిటిసి విరుపాక్షి తెలిపారు. శుక్రవారం చిప్పగిరిలోని ఆయన నివాసంలో ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు తరలివచ్చి విరుపాక్షిని శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా విరుపాక్షి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తనపై నమ్మకంతో ప్రజలకు సేవ చేసేందుకు అవకాశం కల్పించారని తెలిపారు. 2024లో ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి గెలవడం ఖాయమని జోస్యం చెప్పారు.



విరుపాక్షిని సన్మానిస్తున్న నాయకులు

పి.కోటకొండలో బాలికపై అత్యాచారం

- బాలికకు అస్వస్థత - కోడుమూరు ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి- దేవనకొండ

అభం శుభం తెలియని ఓ చిన్నారిపై ఓ యువకుడు అత్యాచారం చేయడంతో బాలిక అస్వస్థతకు గురైంది. శుక్రవారం బాలికను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కోడుమూరు ఆస్పత్రికి తరలించారు. గ్రామస్తుల వివరాల మేరకు... మండలంలోని పి.కోటకొండ గ్రామంలో ఏడేళ్ల చిన్నారిపై అదే గ్రామానికి చెందిన చింతొక్కు ముని రంగడు అనే యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువకుడు అత్యాచారం చేయడంతో తీవ్ర రక్తస్రావం కావడంతో, విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కోడుమూరు ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలి

- కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవసహాయం, ఆనంద్‌బాబు

ఎమ్మిగనూరు : బాలికపై అత్యాచారానికి పాల్పడిన బోయ ముని రంగడును కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవసహాయం, ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామానికి చెందిన బాలికపై బోయ ముని రంగడు అత్యాచారానికి పాల్పడ్డారని తెలిపారు. రక్తస్రావం కావడంతో బాలిక ఏడవడంతో పరారయ్యాడని చెప్పారు. బాలిక తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం కర్నూలుకు తీసుకెళ్తుండగా దేవనకొండ ఎస్ఐ కోడుమూరు దగ్గర ఆపి, ఫిర్యాదు చేసిన తర్వాత తీసుకెళ్లాలని హుకుం జారీ చేయడంతో బాలిక తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురయ్యారని తెలిపారు. ఈ విషయంపై కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎస్ఐని నిలదీయడంతో చికిత్సకు తరలించమని పేర్కొన్నారు. నిందితుడు బోయ ముని రంగడును శిక్షించాలని కోరారు. న్యాయం జరిగేంత వరకు బాలిక కుటుంబానికి అండగా ఉంటామని హామీఇచ్చారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ ఉన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

సిఐ శ్రీనివాసులుకు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి - మంత్రాలయం

బదిలీపై వెళ్తున్న సిఐ శ్రీనివాసులుకు పోలీసు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. మంత్రాలయం సిఐగా ఉన్న శ్రీనివవాసులు దేవరకొండ పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో మంత్రాలయం, మాధవరం ఎస్ఐలు వేణుగోపాల్ రాజు, కిరణ్ బాబు ఆధ్వర్యంలో శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల, కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని పి.కోటకొండ గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా ఈనెల 14, 15న గ్రామస్థాయి కబడ్డీ, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. డివైఎఫ్ఐ, సిఐటియు, రజక వృత్తిదారులు, వ్యవసాయ, రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు నాయకులు ఉప సర్పంచి కౌలుట్ల స్వామి, మహబూబ్ బాషా, సుభాన్, రామాంజనేయులు శుక్రవారం తెలిపారు. కబడ్డీ, ముగ్గుల పోటీల్లో విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డుపై డ్రెయినేజీ నీరు..

పట్టించుకోని అధికారులు

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని హనవాళ్ గ్రామం 1వ వార్డులో పీర్ల మసీదు ముందు రోడ్లపై, ఇళ్ల ముందు మురుగునీరు, డ్రెయినేజీలను శుభ్రం చేయడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు, మండల కార్యదర్శి కె.లింగన్న, మండల నాయకులు బాష, శాఖ కార్యదర్శి దస్తగిరి బాష విమర్శించారు. శుక్రవారం వారు గ్రామంలో డ్రెయినేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో డ్రెయినేజీలు నిండిపోయి ఎక్కడికక్కడ మురుగునీరు రోడ్లపై, ఇళ్ల ముందు నిలిచి దుర్వాసన వస్తోందని తెలిపారు. డ్రెయినేజీలను శుభ్రం చేస్తున్నారా అని స్థానికులను అడిగితే ఎవరూ పట్టించుకోవడం లేదని తెలిపారని అన్నారు. పంచాయతీ అధికారులు తక్షణమే డ్రెయినేజీలను శుభ్రం చేయించి, రోడ్లపై నిలిచిపోయిన మురుగునీటిని తొలగించాలని కోరారు. లేకపోతే సచివాలయం ముందు ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

- వైసిపి నాయకులు రామన్నగౌడ్

ప్రజాశక్తి - కౌతాళం



మండలంలోని నదీచాగి, కాత్రికి, బాపురం నుంచి కౌతాళం వరకు తారు రోడ్డు వేసి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని వైసిపి మండల నాయకులు రామన్న గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. మండలంలోని నదీచాగి నుంచి కౌతాళం వరకు రోడ్డు అధ్వానంగా ఉందని నదీచాగి నాయకులు రామన్నగౌడ్, బాపురం గురునాథరెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఎమ్మెల్యే స్పందించి నదిచాగి నుంచి తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని హామీఇచ్చినట్లు చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం నదీచాగి, కాత్రికి గ్రామానికి ఉన్న రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా చేపట్టినట్లు తెలిపారు. పుష్కరాల సమయంలో మేళిగనూరు గ్రామస్తుల కోరిక మేరకు శ్రీరామలింగేశ్వర దేవస్థానం నుంచి బస్టాండ్ వరకు ఉన్న మట్టి రోడ్డుకు బదులుగా సిసి రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. ఈశప్పగౌడ, బగ్గూరగౌడ్, కురువ ఆదెప్ప, నాగేష్ పాల్గొన్నారు.

టిడిపి నాయకునికి పుత్రవియోగం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని టిడిపి సీనియర్ నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త ఎలిగే పాండు రంగారావు కుమారుడు శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షి నాయుడు రంగారావు ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాండు రంగారావుకు ధైర్యం చెప్పి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. బుద్ధారెడ్డి, రామస్వామి ఉన్నారు.

జగన్‌కు రుణపడి ఉంటాం

- బెల్డోన సహకార సంఘం ఛైర్మన్ మల్లికార్జున

ప్రజాశక్తి - చిప్పగిరి



జిల్లాలో వాల్మీకులకు పెద్దపీట వేసి రెండు స్థానాలను కేటాయించినందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి రుణపడి ఉంటామని బెల్డోన సహకార సంఘం ఛైర్మన్ ఉనేబాద్ మల్లికార్జున తెలిపారు. శుక్రవారం చిప్పగిరిలోని బెల్డోన సహకారం సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఒక్క చిప్పగిరి మండలం నుంచి కర్నూలు ఎంపీ అభ్యర్థిగా గుమ్మనూరు జయరామ్‌ను, ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా బి.విరుపాక్షిని ఇద్దరు వాల్మీకులను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గుర్తించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వైసిపిలో బీసీలకు అందులో వాల్మీకులకు పెద్ద పీట వేసి ఆచరణలో పెట్టడం ఇందుకు నిదర్శనమన్నారు. ఇద్దరినీ గెలిపించుకొని వైసిపి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. వైసిపి నాయకులు దామోదర్, నాగార్జున పాల్గొన్నారు.

ఘనంగా ఖాదర్ లింగ స్వామి జయంతి

ప్రజాశక్తి - కౌతాళం



చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

కౌతాళంలో శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి వారి 404వ జయంతి వేడుకలను దర్గా 11వ ధర్మకర్త సయ్యద్ మున్నా పాషా చిస్తీ, పీఠాధిపతి సయ్యద్ ఖాదర్ బాషా హుసేని ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ధర్మకర్త మాట్లాడుతూ... మతసామరస్యానికి ప్రతీక కౌతాళం దర్గా అని తెలిపారు. ఈ ప్రాంతంలో హిందూ, ముస్లింలు ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి జీవిస్తారని చెప్పారు. ఈ ప్రాంతంలో శ్రీశివయోగి స్వాముల వారి నుంచి ఖాదర్ లింగ స్వామి చిత్రపటాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లడం విశేషమని తెలిపారు. యాదగిరి ఎమ్మెల్యే చెన్నారెడ్డి, ఆంధ్ర రాష్ట్రం నుంచే కాక కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అనంతరం దర్గాలో అన్నదానం ఏర్పాటు చేశారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- ప్రిన్సిపల్ పద్మావతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్



జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి చేరేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపల్ పద్మావతి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడారు. 6వ తరగతిలో 80 సీట్లు ఉండగా ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 6,120 మంది విద్యార్థులు పోటీ పడుతున్నారని తెలిపారు. ఈనెల 20న ఉదయం 11.30 నుంచి 1:30 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 22 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. నమోదు చేసుకున్న అభ్యర్థులు రిజిస్ట్రేషన్ నెంబర్, పాస్ వర్డ్‌గా పుట్టిన తేదీని ఉపయోగించుకొని అడ్మిట్ కార్డులను https://cbseitms.rcil.gov.in/nvs/AdminCard/AdminCard వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ నెంబర్ మరిచిపోయిన అభ్యర్థులు బనవాసి జవహర్ నవోదయ విద్యాలయ హెల్ప్ లైన్ నెంబర్స్ సహకారంతో నెంబర్ తెలుసుకొని డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. అలాగే ఈనెల 18న కర్నూలులోని మాంటిస్సోరి స్కూల్ (ఎక్యాంపు)లో జిల్లా విద్యాధికారుల పర్యవేక్షణలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు 085212-29454, 8074952380, 9985738899 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

తక్కలకోట రస్తా అక్రమ కట్టడాన్ని ఆపండి

- రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేష్

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుంద వాల్మీకి సర్కిల్ నుంచి వెళ్లే తక్కలకోట రస్తాను ఆక్రమించి నిర్మాణం చేపడుతున్న కబ్జాదారునిపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేష్, రైతులు కోరారు. శుక్రవారం తహశీల్దార్ హుస్సేన్ సాబ్, ఆర్ఐ దినోజు కుమార్, రెవెన్యూ ఆఫీసర్ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సర్వే నెంబర్ 403లో తక్కలకోట రస్తాపై కొందరు కబ్జాదారుల కన్ను పడిందని, ఎలాగైనా సొంతం చేసుకోవాలని అక్రమ కట్టడాలకు తెర లేపారని తెలిపారు. ఐదు రోజుల క్రితం తహశీల్దార్ వినతిపత్రం ఇచ్చినా స్పందన లేదన్నారు. యథావిధిగా నిర్మాణం చేపడుతుంటే అడ్డుకోకపోవడంలో ఆంతర్యమేమిటని అధికారులను నిలదీశారు. వందలాది కుటుంబాలు అదే రస్తాలో పొలాలకు వెళ్తారని, అక్కడే కొత్తగా కాలనీలు కూడా ఏర్పడ్డాయని తెలిపారు. ఒకరిద్దరి స్వార్థం వల్ల వందలాది కుటుంబాలు ఇబ్బందులు పడతాయని చెప్పారు. ఆ స్థలాన్ని సర్వే చేయించి రెవెన్యూ రికార్డు ప్రకారం రస్తా హద్దులు చూపించాలని డిమాండ్ చేశారు. తహశీల్దార్ స్పందిస్తూ... తక్కలకోట రస్తాలో సర్వే పనులు పూర్తయినంత వరకు అక్రమ కట్టడాలు నిలుపుదల చేయాలని హోళగుంద పోలీసులకు ఫోన్ ద్వారా తెలిపారు. రైతులు హుస్సేన్ పీరా, సిద్ధిక్ సాబ్, బాబు సాబ్, రెహమాన్ పాల్గొన్నారు.

ఆలూరు ఇన్‌ఛార్జీగా విరుపాక్షి

- వైసిపి నాయకుల హర్షం

ప్రజాశక్తి - ఆస్పరి

చిప్పగిరి జడ్‌పిటిసి విరుపాక్షిని ఆలూరు ఇన్‌ఛార్జీగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నియమించడంతో చిన్నహోతూరు, బిణిగేరి సర్పంచులు హరికృష్ణ, వెంకటేష్, వైసిపి నాయకులు ప్రకాష్, మహానంది, పాండు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆస్పరి నుంచి పది వాహనాలతో వైసిపి నాయకులు చిప్పగిరికి వెళ్లి విరుపాక్షిని కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతు బిడ్డ జడ్‌పిటిసి విరుపాక్షిని గుర్తించి ఆలూరు ఇన్‌ఛార్జీగా నియమించడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామని, రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విరుపాక్షిని అత్యధిక మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రికి బహుమతిగా ఇస్తామన్నారు. వైసిపి అధికారంలోకి రావాలంటే నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. చంద్రబాబు నాయుడు ఎన్ని వ్యూహాలు రచించినా అధికారంలోకి వచ్చేది వైసిపినేనని ధీమా వ్యక్తం చేశారు. వైసిపి నాయకులు బిటెక్ వీరభద్ర, లక్ష్మన్న, మహేంద్ర, సుదర్శన్, నెట్టేకలు, పెద్దయ్య, యువరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి నాయకులు

వివక్ష వీడని పాలకులు

- టిడిపి జిల్లా కార్యదర్శి బుద్ధారెడ్డి

ప్రజాశక్తి - ఆదోని



'గడపగడపకు' ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుంటూ పరిష్కార దిశగా కృషి చేస్తామని చెబుతున్న పాలకులు, అధికారులు వివక్ష చూపుతున్నారని టిడిపి జిల్లా కార్యదర్శి బుద్ధారెడ్డి విమర్శించారు. అభివృద్ధిని వివరించే కార్యక్రమంలోనూ అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వీడడం లేదని తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల మండిగిరి పరిధిలోని తిరుమలనగర్ ప్రాంతంలో 'గడపగడపకు మన ప్రభుత్వం'ను సచివాలయ అధికారులు నిర్వహించారని తెలిపారు. అదే ప్రాంతంలో ఉన్న తన ఇంటికి అధికారులు కానీ, పాలకులు కానీ, ఇతర వైసిపి నాయకులు కానీ రాలేదన్నారు. తన ఇంటి చుట్టూ ఉన్న అన్ని ఇళ్లను సందర్శించిన అధికారులు, పాలకులు తన ఇంటికి రావడానికి జంకుతున్నారని తెలిపారు. ఎక్కడ సమస్యలపై ప్రశ్నిస్తానని ఆందోళన చెంది ఉంటారేమోనని పేర్కొన్నారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' వైసిపి ప్రచార కార్యక్రమంగా మారిందని, ఇంటింటికీ వెళ్లి ఓట్లు అడుగుతున్నారని తెలిపారు. ఎవరైనా సమస్యలపై అడిగితే ఇంకా చేస్తామని హామీలు ఇస్తున్నారు తప్ప చేయడం లేదన్నారు. ఎక్కడా ప్రజలు చెప్పిన సమస్యలను నోట్ చేసుకోవడం లేదని తెలిపారు. తిరుమల నగర్ ప్రాంతంలో ఒక వృద్ధురాలు నాలుగేళ్ల నుంచి తనకు పింఛను రావడం లేదని అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని చెప్పారు. 'గడపగడపకు'ను వివక్ష లేకుండా నిర్వహించాలని, అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని కోరారు. ఇలా పార్టీ ప్రచార కార్యక్రమంగా నిర్వహించకుండా ఉన్నతాధికారులు చూడాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుంద తహశీల్దార్ హుస్సేన్ సాబ్ శుక్రవారం ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆర్ఐ దినోజు కుమార్, విఆర్ఓలు నాగరాజు, హనుమంతు, వీరేష్, ప్రజాశక్తి రిపోర్టర్ నాగరాజు, సిపిఎం మండల కార్యదర్శి వెంకటేశులు, దేవేంద్ర పాల్గొన్నారు.







అంగన్వాడీలపై నిరంకుశత్వం తగదు

- అంగన్వాడీల పోరాటానికి వ్యకాసం, ప్రజా సంఘాలు, న్యాయవాదుల సంఘీభావం
- అండగా ఉంటాం : వ్యకాసం రాష్ట్ర ఉపాధ్యక్షులు శివ నాగమణి
- సంతకాల సేకరణతో అంగన్వాడీల నిరసన



బేతంచెర్ల: స్పృహ పడిపోయిన అంగన్వాడీ కార్యకర్తకు సహాయ చర్యలు చేస్తున్న తోటి అంగన్వాడీలు



పగిడ్యాల : కెసి కెనాల్‌లో నీటిలో దిగి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శివనాగమణి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశత్వంగా వహించడం సరికాదని, అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శివ నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నంద్యాల జిల్లా కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన 24 గంటల రిలే నిరాహార దీక్షలకు ఏపి వ్యకాసం రాష్ట్ర ఉపాధ్యక్షులు శివ నాగమణి, జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరరావు నిహార దీక్షలను ప్రారంభించి సంఘీ భావం తెలిపారు. ఈ సందర్భంగా శివ నాగమణి మాట్లాడుతూ ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక తెలంగాణ రాష్ట్రం కంటే ఒక వెయ్యి అదనంగానే పెంచి ఇస్తానని చెప్పారని ఇప్పటికైనా ప్రభుత్వం చర్చలకు పిలిచి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని ఆమె సూచించారు. అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి హనుమంతు తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఏడవ రోజు శనివారం జరిగిన 24 గంటల రిలే నిరాహార దీక్షలలో డోన్ ప్రాజెక్టు, నందికొట్కూరు ప్రాజెక్టుల పరిధిలోని వివిధ మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు దీక్షలో కూర్చున్నారు. బేతంచెర్ల మండలం నుండి ఏపీ అంగ న్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి. షేబా, ఎంకే నాగ లక్ష్మి, శివమ్మ, సుబ్బలక్ష్మి, రామేశ్వరి రామేశ్వరి, రమణమ్మ, రామలక్ష్మి,డోన్ ప్రాజెక్ట్ నుండి సులోచనమ్మ, సుమలత కొత్తపల్లి మండలం నుండి హరిత, శ్రీదేవి, అంకమ్మ సుగుణ శ్యామలమ్మ పాములపాడు మండలం నుండి సౌజన్య, అనురాధ, సునీత, నాగమణి, జ్యోతి తదితరులు కూర్చున్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి పకీర్ సాహెబ్, జిల్లా ఉపాధ్యక్షులు ఎం కరుణ, జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, సీఐటీయూ సీనియర్ నాయకులు తోట మద్దులు, జిల్లా కార్యదర్శి ఎం.నిర్మలమ్మ, నం ద్యాల ప్రాజెక్టు కార్యదర్శి సునీత, జిల్లా సహాయ కార్యదర్శి నాగరాణిలు పాల్గొన్నారు. **బేతంచెర్ల:** పాత బస్టాండు భారత్ బేకరీ సర్కిల్ నందు అంగన్వాడీలు ఒంటి కాలుపై నిలబడి నిరసన తెలిపారు. అనంతరం సిఐటియు పట్టణ కార్యదర్శి సంజీవ నాయుడు, అడ్వకేట్ బండరాముడు, సంఘం మండల అధ్యక్షురాలు ఎస్ గుల్జార్బి తదితరులు మాట్లాడారు. **బనగానపల్లె :** అంగన్వాడీల డిమాండ్లను పరిష్కరించాలని పట్టణంలోని వివిధ కూడల్లో కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సంద ర్భంగా యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి రోజా రమణి మాట్లాడారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి జేవి సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేపట్టి అనంతరం 'జగనన్నకు చెబుదాం కోటి సంతకాల విన్న పం' అంటూ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి మంజుల, నాయకురాలు లక్ష్మీదేవి, ప్రమీలమ్మ, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్ తదితరులు మాట్లాడారు. యూనియన్ నాయకురాలు విజయలక్ష్మి, లక్ష్మీదేవి, సుజాత, సుధారాణి, లక్ష్మి, ప్రియాంక, రవణమ్మ, అరుణ, సిఐటియు నాయకులు సురేంద్ర, స్వాములు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. **న్యాయవాదులు మద్దతు :** అంగన్వాడీలతో ప్రభుత్వం చర్చించి వారి సమస్యలు పరిష్కరించాలని న్యాయవాదులు స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశవరెడ్డి, సీనియర్ న్యాయవాదులు గోవింద్ రెడ్డి, శివ శంకర్ రెడ్డి, రవికుమార్, తదితరులు సమ్మెకు మద్దతు తెలిపారు. **పాములపాడు:** పాములపాడు మండల కేంద్రంలో ప్రజలు అంగన్వాడీ లకు మద్దతుగా సంతకాలు పెద్ద సంఖ్యలో చేసి తమ మద్దతును తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకురాలు శివలక్ష్మి, నాగమద్దమ్మ, నాగమణి, శ్రీలత, వెంకటలక్ష్మి, స్వాతి అంగన్వాడీ టీచర్లు హెల్పర్స్ పాల్గొన్నారు. **పగిడ్యాల :** వీరవోలు బ్రిడ్జి సమీపాన ఉన్న కేసీ కెనాల్ నీటిలోకి అంగన్వాడీలు దిగి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డి తదితరులు మాట్లాడారు. సమస్యలను పరిష్కరించకపోతే బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. **శ్రీశైలం ప్రాజెక్ట్ :** మండలంలో అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు. **పాణ్యం :** ఎంపీడీవో కార్యాలయం దగ్గర సిఐటియు ఆధ్వర్యంలో ఒంటి కాలుపై నిలబడి దండం పెడుతూ శిబిరంలో నిరసన తెలిపారు. ముఖ్యఅతిథిగా సిఐటియు మండల కార్యదర్శి కె భాస్కర్, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకురాలు వెంకటమ్మ పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడారు. **నందికొట్కూరు టౌన్ :** సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీలు ముగ్గులు వేసి నిరసన తెలిపారు. అనంతరం నాయకులు మదార్ బి మాట్లాడారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని తెలిపారు. **చాగలమర్రి :** స్థానిక కేరళ ఆసుపత్రి ఎదురుగా అంబేద్కర్ సర్కిల్లో సిఐటియు నాయకులు పద్మావతి నాగమణి వసంత వై పద్మావతి సంజమ్మ, ఏఐటియుసి నాయకురాలు చంద్రకళ వహీదా ఇందుమతి హసీనాల ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై బైఠాయించి నిరసనను వ్యక్తం చేశారు. సిపిఎం నాయకుడు గుత్తి నరసింహుడు తదితరులు ఉన్నారు.

తరలిపోతున్న అటవీ సంపద..

- ఉచ్చులకు బలవుతున్న వన్యప్రాణులు
- వేటగాళ్ల పై అధికారుల చర్యలేవి?

ప్రజాశక్తి - మహానంది

ఆదాయమే లక్ష్యంగా కొందరు అటవీ శాఖ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. నిత్యం అడవిలో వన్యప్రాణులను వేటాడి సొమ్ము చేసుకుంటున్న అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో వన్యప్రాణులతో పాటు అరుదైన జీవరాసులు ఉన్నాయి. కనుమరుగైపోయాయి అనుకున్న జీవరాసులలో కొన్నింటిని ఇటీవలే కొన్ని నెలల క్రితం గుర్తించిన విషయం తెలిసిందే. చిరుతలు, పెద్ద పులులు భారీగా పెరిగిన సంగతి తెలిసిందే. వీటిని, అడవి సంపదను రక్షించేందుకు ఏర్పాటు చేసిన ఉద్యోగులు విధులకు స్వస్తి పలికి సొంత నిధులకు అలవాటు పడినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చలమ రేంజ్ పరిధిలోని గాజులపల్లె, పచ్చర్ల, బసవాపురం, ప్రాంతాల నుండి నిత్యం అడవి సంపదను బొలెరో వాహనాలలో తరలిస్తున్న అడ్డుకునే నాధుడే లేడని స్థానికులు చర్చించుకుంటున్నారు.

వేటగాళ్లకు బలవుతున్న వన్యప్రాణులు..

దట్టమైన అడవి నల్లమల. ఇక్కడ పెద్ద పులులు, చిరుతలు, పొడదుప్పి, అడవి పందులు, నెమళ్లు, కుందేళ్లు, కొండకోళ్లు అధికంగా ఉన్నాయి. వీటిని రక్షించేందుకు అటవీశాఖ అధికారులు, సిబ్బంది వున్నారు. అటవీ శాఖలో కొందరు సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం చేయడం వల్ల అటవీ జంతువులు వేటగాళ్ల ఉచ్చులకు బలవుతున్నాయి. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో అడవి జంతువులు వేటగాళ్ల చేతిలో ప్రాణాలు కోల్పోతున్నాయి. నాటు తుపాకులతో పాటు, ఉచ్చులను ఉపయోగించి జంతువులను వేటాడుతున్నట్లు తెలుస్తుంది. బసవాపురం నుండి ఎంతో విలువైన అటవీ సంపదను ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ముచేసుకుంటున్నా పట్టించుకునే వారే లేరని స్థానికులు చర్చించుకుంటున్నారు.



వైయస్సార్ నగర్ లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్ పర్సన్ తదితరులు

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

- పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే శిల్పా

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని వైయస్ నగర్ 38వ వార్డులో శుక్రవారం కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణపు పనులను ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి,వ యన్సిపల్ చైర్పర్సన్ మాబున్నిసా, కౌన్సిలర్ సావిత్రమ్మలతో కలిసి ప్రారంభించారు. వార్డులో పనులను వేగవంతంగా పూర్తి చేస్తూ నేటికి 5 కోట్ల రూపాయల వ్యయంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని ఎమ్మెల్యే తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని వైయస్సార్ నగర్ దాదాపు 100 ఎకరాల విస్తీర్ణంలో వ్యాపించి ఉన్నదని, ఈ ప్రాంతంలో అత్యధికంగా నివసిస్తున్న పేద ప్రజల మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రత్యేకంగా నిధులను మంజూరు చేయించి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామ న్నారు. నేడు రూ.97 లక్షల వ్యయంతో సిసి రోడ్లు, డ్రైన్‌ల నిర్మాణ పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో ఈ కాలనీలో ఇంకా పలు ప్రాంతాల లో సిసి రోడ్లు డ్రైన్‌లు, కల్వర్టుల నిర్మాణం అవసరమైందని వాటిని కూడా పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. రూ.40 లక్షలతో ఇప్పటికే టెండర్లను పూర్తి చేయడం జరిగిందని, ఆయా పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. ప్రధానంగా బుడగ జంగాల కాలనీలోని పిల్లలు బడికి వెళ్ళేందుకు ఇబ్బంది పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఈసమస్యను పరిష్కరించేందుకు మండల విద్యాశాఖ అధికారిని చర్చించి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు 20 సెంట్ల స్థలం కేటాయించి పాఠశాలను నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని సూచించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. నంద్యాల నియోజకవర్గ అభివృద్ధి తమ ధ్యేయంగా పనిచేస్తున్నామని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేపడుతామన్నారు. 2024 ఎన్నికల్లో మంచి చేసిన పేదల ప్రభుత్వానికి పట్టం కట్టాలని వైయస్సార్ పార్టీని గెలిపించాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి, వార్డుఇంచార్జ్ టీవీ రమణ, సీనియర్ నాయకులు నరసింహారావు, వార్డు కార్యకర్తలు అన్వర్ బాష, అంకాలయ్య, సోమశేఖర్, శివకృష్ణ, వెంకటస్వామి శెట్టి, తిరుప తయ్య, శేషయ్య, జాకీర్, రామకృష్ణారెడ్డి, ఖాదర్ బి,నాని,సాయిరాం, శంకరయ్య,టైలర్ నాగేంద్ర, హొటల్ సలాం, మోతి మౌలాలి, దర్గయ్య, శిరసాల సుంకయ్య, బైలిపాటి రమణ, మోతె బయన్న, సిరిసాల వెంకటేష్, మద్దిలేటి ది పాల్గొన్నారు.

పెండింగ్ అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

- ఇదే తనకు చివరి సమావేశం - ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధికి కలిసి పనిచేద్దాం
- నంద్యాల మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి



మాట్లాడుతున్న నంద్యాల తహసిల్దార్ శ్రీనివాసులు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

మండలంలో ఇంకా ఏవైనా అభివృద్ధి పనులు కాని, ప్రాధాన్యత భవనాలు కాని పెండింగ్ ఉంటే త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎలక్షన్ల సమయం దగ్గర పడింది కాబట్టి ఎప్పుడైనా ఎన్నికల కోడ్ రావచ్చు కాబట్టి ఇదే తనకు ఆఖరి సర్వసభ్య సమావేశం కావచ్చు అని, ప్రజల ఆశీర్వదిస్తే మరలా మీ అందరితో కలిసి పనిచేసే అవకాశం కలుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నంద్యాల పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయనందు మండల అధ్యక్షులు శెట్టి ప్రభాకర్ అధ్యక్షతన ఎంపిడిఒ సుగుణ శ్రీ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, మండలంలోని వివిధ శాఖల అధికారులు,గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ మెంబర్స్ హాజరు అయ్యారు. సమావేశం ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ ఎమ్మెల్యే రవిచంద్ర కిషోర్ రెడ్డి రాకతో ఈ సమావేశం ఆసక్తికరంగా సాగింది. ముందుగా ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతు భరోసా కేంద్రాలు, జగనన్న గృహాలు, అభివృద్ధి పనులను గురించి వివరించారు. పెండింగ్‌లో ఉన్న వివిధ భవన నిర్మానాలు, హెల్త్ కేంద్రాలు సచివాలయాలు, నాడు నేడు పాఠశాలల పనులు త్వరగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ పదికారిని ఆదేశించారు. పుసులూరు గ్రామంలోని తాగునీటి సమస్య నిర్మూలనకు చేపట్టిన పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు తాగునీరు అందించాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారిని ఎమ్మెల్యే ఆదేశించారు. నంద్యాల తాసిల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ సర్వే కార్యక్రమం దాదాపుగా పూర్తి చేయడం జరిగిందన్నారు. తప్పులుంటే సరిచేసుకునే అవకాశం ఉందన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ తమ శాఖల యొక్క వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్త

- జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ప్రజలకు సూచించారు. సైబర్ నేరగాళు వివిధ పేర్లతో మాయ మాటలతో 9346188819 నంబర్ నుండి కాల్ చేస్తున్నారన్నారు. తెలిసిన వారికి మాత్రమే ఫోన్ పేలో డబ్బులు పంపించాలి తప్ప అపరిచిత వ్యక్తులకు ఎట్టి పరిస్థితులలో డబ్బులు పంపించొద్దంటూ ఎస్పీ పేర్కొన్నారు. నంద్యాల జిల్లాలో 5 ప్రాంతాలలో డోన్, ఆత్మకూరు, చాగలమర్రి,గడివేముల,బనగానపల్లి మొదలగు ప్రాంతాలలో సైబర్ క్రైమ్ మోసాలు జరుగుతున్నాయని అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మోసాలకు గురయితే వెంటనే అప్రమత్తమై గోల్డెన్ హవర్స్ అయిన 24 గంటల లోపు ఫిర్యాదు చేయాలన్నారు. లేదా నేషనల్ సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలి లేదా నేషనల్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ https://cyber-crime.gov.in/ లో ఫిర్యాదు చేయవచ్చును లేదా నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో సైబర్ క్రైమ్ ఆఫీస్‌కు వచ్చి గాని 9154987034 నంబర్ ద్వారా సమాచారం తెలుసుకొని ఫిర్యాదు చేయవచ్చు అన్నారు.

శ్రీశైలంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుండి ప్రారంభం అయ్యాయి. మకర సంక్రమణాన్ని పురస్కరించుకొని జనవరి 12వ తేదీ నుండి 18వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు పంచాహ్నిక దీక్షతో ప్రారంభమై ఏడు రోజులు పాటు జరిగే బ్రహ్మోత్సవాలు 18వ తేదీతో ముగియనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఉదయం 8.30 గంటలకు స్వామివారి యాగశాల ప్రవేశం చేసి కార్యక్రమం ప్రారబించడం జరిగింది. అనంతరం లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ అర్చక స్వాములు సంకల్పం చెప్పడం జరిగింది. ఆ తర్వాత గణపతి పూజ, చండీశ్వర పూజ, కంకణ ధారణ, అఖండదీపారాధన, వాస్తు పూజ, వాస్తు పూజ, వంటి ప్రత్యేక పూజలు నిర్వహించబడ్డాయి. సాయంత్రం 5 గంటలకు అంకురార్పణ అగ్ని ప్రతిష్టాపన, 7 గంటలకు ధ్వజారోహణ, ధ్వజ పటావిష్కరణ, ఈ కార్యక్రమాలు జరిగాయి. ఆ తర్వాత ప్రతిరోజు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ఈఓ దంపతులు, ఏసి దంపతులు, ఏఈఓలు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పెద్దిరాజు దంపతులు

నందాల రామకృష్ణరాజు మృతి బాధాకరం

- సంతాపం తెలిపిన ఎమ్మెల్యే కాటసాని, మాజీ ఎమ్మెల్యే బీసీ

ప్రజాశక్తి - అవుకు

అవుకు రాజా వంశస్థుడు నంద్యాల నల్ల తిమ్మరాజు కుమారుడు నంద్యాల రామకృష్ణరాజు ఆకస్మిక మృతి బాధాకరమని బనగానపల్లె శాసన సభ్యులు కాటసాని రామిరెడ్డి, మాజీ శాసనసభ్యులు బీసీ జనార్దన్ రెడ్డిలు అన్నారు. శుక్రవారం అవుకు పట్టణంలోని రాజా వంశస్థుల స్వగృహంలో గురువారం మృతి చెందిన నంద్యాల రామకృష్ణ రాజు మృతదేహానికి బనగానపల్లె శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి, మాజీ శాసనసభ్యులు బీసీ జనార్దన్ రెడ్డిలు వేరువేరుగా నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి రాజు కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. నంద్యాల రామకృష్ణరాజు మృతి చెందటంతో అవుకు పట్టణంలో విషాద ఛాయలు అలుము కున్నాయి. ప్రజలు రాజు స్వగహంలో కృష్ణంరాజు మృత దేహానికి నివాళులు అర్పించి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మృతదేహాన్ని గ్రామ పురవీధులలో భాజా భజంత్రీలతో అంతిమయాత్రను కొనసాగించారు.



సంతాపం తెలిపిన ఎమ్మెల్యే కాటసాని, మాజీ ఎమ్మెల్యే బీసీ



మరపురాని మనిషి మైనేని వెంకటరత్నం : యుటిఎఫ్



వెంకటరత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - బనగానపల్లె

మరుపురాని మనిషి మైనేని వెంకటరత్నం అనే యుటిఎఫ్ జిల్లా సహా అధ్యక్షులు సత్య ప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రతాప్, ఎం వెంకటేశ్వర్లు అధ్యక్షతన యుటిఎఫ్ పత్రిక సంపాదకులు, యుటిఎఫ్ వ్యవస్థాపకుల్లో ఒకరైన మైనేని వెంకటరత్నం వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మైనేని వెంకట రత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సంద ర్భంగా జరిగిన సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు కే సత్య ప్రకాష్ మాట్లాడుతూ ఐక్య ఉపాధ్యాయ పత్రికకు మొదటి ప్రధాన సంపాదకులు మైనేని కలం యోధులు అన్నారు. మైనేని రచనలు ఉద్యమ స్ఫూర్తిని, సామాజిక చైతన్యాన్ని నింపేవిగా ఉండేవి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కన్వీనర్ యు దస్తగిరి, గౌరవ అధ్యక్షులు బి సుధాకర్, సహాధ్యక్షులు శ్రీకష్ణయ్య, ఆర్థిక కార్యదర్శి ఎం విజయ్ కుమార్, పూజారి శ్రీనివాసులు, ఎన్ సతీష్ కుమార్, సుధాకర్, జి డేవిడ్, కే గోపాల్, వై మనోహర అవుకు మండలం అధ్యక్షులు కే మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి ఎస్ లక్ష్మీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి రాష్ట్రాల రాయల్ కాప్స్ యువ పొలిటికల్ అధ్యక్షుడిగా శివ రాయల్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రాయల్ కాప్స్ తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల చైర్మన్ బోళ్ళ దేవి నాయుడు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాది, లీగల్ సెల్ చైర్మన్ బోళ్ళ బాలాజీ శుక్రవారం అహోబిలం లక్ష్మి నరసింహ స్వామిని దర్శించుకు న్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనం తరం రాయల్ కాప్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీని ఎన్నుకున్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల రాయల్ కాప్స్ యువ పొలిటికల్ ప్రెసిడెంట్ గా సిరివెళ్ల కు చెందిన అంగం శివ రాయల్, రాష్ట్ర లీడర్‌గా గూడూరు సంజీరాయుడు, ఆళ్ళగడ్డ తాలుకా రాయల్ కాప్స్ అధ్యక్షుడుగా చలివేందుల రాజారామ్, ఆళ్ళగడ్డ పట్టణ ఇన్చార్జిగా వరద జగదీష్, ఉపాధ్యక్షులుగా రాచంసెట్టీ చిన్న పెద్దయ్య, రుద్రవరం మండల అధ్యక్షుడిగా సంగ వెంకట రమణలను నియమించారు. ఈ సందర్భంగా వారు బలిజ, కాపుల అభివృద్ధి, వెనకబడిన వారి అభివృద్ధికి, సేవా కార్యక్రమాల్లో ముందు కెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా కమిటీ వారు మాట్లాడుతూ, తమపై నమ్మకం ఉంచి ఏపీ, తెలంగాణ రాష్ట్రాల రాయల్ కాప్స్ యువ పొలిటికల్ లీడర్లుగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. బలిజల అభివృద్ధికి కృషి చేస్తానని, సేవా కార్యక్రమాల్లో ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రమేష్ బాబు,పత్తి రామకృష్ణ, రాయల్ కాప్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అధ్యక్షుడిగా శివకు నియామక పత్రం అందిస్తున్న దృశ్యం

మార్కెట్ యార్డ్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

స్థానిక మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం శాసనసభ్యులు గంగుల బిజేంద్ర రెడ్డి సతీమణి సారికా రెడ్డి, సోదరి అవంతిక రెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు వచ్చి ముగ్గుల పోటీలలో పాల్గొన్నారు. ముగ్గుల ఫోటోలు మంచి ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులను అందజేశారు. ముగ్గుల పోటీలలో మిట్టపల్లి గ్రామానికి చెందిన ప్రసాద్ అనే దివ్యాంగుడు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్రాన్ని ముగ్గుతో వేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ప్రసాదును గంగుల సారిక రెడ్డి, అవంతిక రెడ్డిలు ప్రత్యేకంగా అభినందించారు. ఈ ముగ్గుల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సుజాత, నాగలక్ష్మి లు వ్యవహరించారు. అనంతరం ముగ్గుల పోటీలలో పాల్గొన్న వారందరికీ అన్నదానం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గొట్లూరు, సుధాకర్ రెడ్డి, వరాలమ్మ, రాధమ్మ, బద్రి నాగేశ్వరమ్మ, న్యాయవాది సరితా రెడ్డి, బద్రి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీలను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే సతీమణి, సోదరి

పార్టీ ఆదేశిస్తే ఎక్కడినుండైనా పోటీ చేస్తా

- ఏవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి- నంద్యాల కలెక్టరేట్



అధిష్టానం ఆళ్లగడ్డ నుండైనా ఎక్కడి నుండైనా పోటీ చేయమని ఆదేశిస్తే తాను పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని, ఆళ్లగడ్డ అఖిలప్రియకు కాకుండా ఎవరికిచ్చినా వారి గెలుపు కోసం పని చేస్తానని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవి సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం నంద్యాలలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 19న ఆళ్లగడ్డలో జరిగిన రా కదలి రా బహిరంగ సభకు పార్టీ పైన ఉన్న గౌరవంతోనే రాలేదని, ఆళ్లగడ్డలో నా ఇంటికి తెలుగుదేశం జిల్లా అధ్యక్షులు, జిల్లా వ్యవహారాల ఇంచార్జ్ ప్రభాకర్ చౌదరి తదితర నాయకులు వచ్చి కోరితేనే రాలేదన్నారు. ఎవరికి భయపడి కాదన్నారు. ఆళ్లగడ్డ నుండి నాకు సీటు ఇస్తే భారీ మెజార్టీతో గెలుస్తానని, చంద్రబాబు నాయుడుకు గిఫ్ట్‌గా ఇస్తానన్నారు. నంద్యాల నియోజకవర్గం ఇంచార్జ్ మార్పు పైన అధిష్టానం లెటర్‌తో పేపర్లలో ప్రకటన వస్తుందన్నారు. ఆళ్లగడ్డలో జరిగిన బహిరంగ సభ ఆర్ నియోజకవర్గాల నుండి నాయకులు చేసిన కృషి వల్లనే విజయవం తమైందన్నారు. నంద్యాలలో ప్లెక్షీల పేరుతో పరువుని ఇబ్బంది పెట్టేం దుకు కొంతమంది చేసే ప్రయత్నాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి -ప్యాపిలి

వాల్మీకులైన గుమ్మనూరు జయరాం,శాంతా విరూపాక్షి, తలారి రంగయ్య ఇద్దరికి ఎంపీల సీట్లు ఇద్దరు ఎమ్మెల్యేలకు సీట్లు కేటాయించడం వల్ల జగన్మోహన్ రెడ్డికు ధన్యవాదాలు తెలిపారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో వాల్మీకి నాయకులు అయిన కొండయ్య, కేశవులు, మద్దయ్య, రంగస్వామి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. వారు మాట్లాడుతూ వాల్మీకులమంత కలిసి రాబోయే సార్వత్రిక ఎన్నికలలో జగన్ మోహన్ రెడ్డి విజయానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాండు, రామానాయుడు, బంగి రాము, రంగన్న, రంగనాయకులు, వెంకటేశు, గుజ్జుల శీను, నారాయణ, రంగస్వామి, రాముడు తదితరులు పాల్గొన్నారు.



జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేసిన వాల్మీకులు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - శ్రీశైలం

అఖిలభారత నాయి బ్రాహ్మణ అన్నదాన సత్రంలో 2024 క్యాలెండర్‌ను శుక్రవారం నాడు ఆవిష్కరించారు. సత్రం అధ్యక్షులు ఆదినారాయణ ముందుగా మహాశివరాత్రి కార్యకర్తల సమావేశంలో రాబోయే మహాశివరాత్రి ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం 2022-23 సంవత్సరాల జమ ఖర్చులు సత్రం ప్రధాన కార్యదర్శి ఆత్మకూరు శివయ్య ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి పోతేశ్వరరావు, కమిటీ సభ్యులు పోలీస్ వెంకటస్వామి, మద్దిలేటి, శివయ్య, ప్రకాశం జిల్లా నుండి బోయిలపల్లి నాసరయ్య, శ్రీనివాసులు, భోజనం శ్రీనివాసులు, కడప జిల్లా నుండి ఓబులేసు, నందికొట్కూరు నుండి వేణు, ఇతర జిల్లాల నుండి ప్రచార కార్యకర్తలు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయిలో సత్తా చాటాలి

ప్రజాశక్తి - కొత్తపల్లి

మండలంలో ఉన్న క్రీడాకారులందరూ నియోజకవర్గ స్థాయిలో సత్తా చాటి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఎంపీడీవో మేరీ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గత రెండు రోజుల నుంచి గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారులకు పలు క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగానే ఖోఖో, షటిల్ పోటీలు నిర్వహించగా ఖోఖోలో ముసలమడుగు జట్టు, షటిల్ పోటీల్లో దుద్యాల జట్టు విజయం సాధించి నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యాయి. ఇంద్రుడా పోటీల్లో వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రశేఖర్ స్వప్న సుంకన్న సచివాలయ సిబ్బంది పలు శాఖల అధికారులు క్రీడాకారులు ఉన్నారు.

'పేదలకు సాగు పట్టాలు ఇవ్వండి'

ప్రజాశక్తి - నందికొట్కూరు

మండల పరిధిలోని బ్రాహ్మణ కొట్కూరు గ్రామంలో ఎస్సీ, బిసి కులాలకు చెందిన నిరుపేదలు దాదాపు 25 సంవత్సరాలుగా ప్రభుత్వ భూములను సాగు చేసు కుంటున్నారని వారికి ప్రభుత్వం అందజేస్తున్న పట్టాలు అందజేయాలని బ్రాహ్మణ కొట్కూర్ గ్రామ ప్రజలు శుక్రవారం డిప్యూటీ తహశీల్దార్ సోమేశ్వరి దేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో ప్రభుత్వ భూములు దాదాపు 25 ఏళ్ళనుండి సాగులో ఉన్న ప్రజలు తాము సాగులో ఉన్న భూములకు ఆన్లైన్ చేసి, అసైన్మెంట్ కమిటీ ద్వారా పట్ట, పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని 40 మంది సాగుదారులు డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మద్దమ్మ, భాగ్యమ్మ, రాజమ్మ, రామక్క, చిట్టెమ్మ, మనోరాజ్, మధుసూదన్, రామగిడ్డయ్య, నాగ రత్నం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి



చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు



జాతీయ యువ టెన్నిస్ క్రీడాకారుడు సాయి చందన్ కు యువజన దినోత్సవ పురస్కారం అందిస్తున్న నంద్యాల లయన్స్ క్లబ్ సభ్యు లు

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో జాతీయ యువజన దినోత్సవం, ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధికారవాణి'ఐక్య ఉపాధ్యాయ'పత్రిక ప్రధాన సంపాదకులుగా పత్రిక నిర్వహించిన మైనేని వెంకట రత్నం వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారి చిత్రపటాలకు పూలమా లలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.వెంకటసుబ్బారెడ్డి,జిల్లా కార్యదర్శి బివై సుబ్బారాయుడు,పూర్వ జిల్లా గౌరవాధ్యక్షులు బాబు, సహాధ్యక్షులు రామమూర్తిలు మాట్లాడుతూ అతి చిన్న వయ సులోనే ఆధ్యాత్మిక మార్గంలో అడుగు పెట్టిన మహనీయుడు వివేకానంద అని, ఓడి పోతానన్న భయంతో ప్రయత్నించకపోవడం కన్నా, ప్రయత్నించి ఓడిపోవడం మేలు అంటూ యువతకు స్ఫూర్తి నింపి,భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని కొనియాడారు. మైనేని వెంకట రత్నం పోరాటాలకు పదునుపెడుతూ, విద్యా రంగంలో వస్తున్న మార్పులకు ప్రత్యామ్నాయం చూపుతూ విద్యా విషయక పత్రికల్లో సాటిలేని మేటి పత్రికగా తీర్చిదిద్దారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలరంగారెడ్డి, జగన్నాథ్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ..

నంద్యాల : స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ యువజన ఉత్సవాలలో భాగంగా నంద్యాల లయన్స్ క్లబ్ శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. లయన్స్ క్లబ్ అధ్యక్షులు పివి సుధాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎంఎ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ జి.రవికృష్ణ, సూరన సారస్వత సంఘం అధ్యక్షులు డాక్టర్ సహదేవుడు ముఖ్య అతిథులుగా పాల్గొని వివేకానం దుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భ ంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బధిర టెన్నిస్ టోర్నమెంట్లలో పలు పతకాలు సాధించిన నంద్యాలకు చెందిన యువ టెన్నిస్ క్రీడాకా రుడు సాయి చందన్‌కు లయన్స్ క్లబ్ జాతీయ యువజన దినోత్సవ పురస్కారం అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ సహదేవుడు మాట్లాడుతూ స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత దేశ అభివద్ధిలో భాగం కావాలని,క్రమశిక్షణతో సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పీ.వీ.సుధాకర్ రెడ్డి,సోమేశుల నాగరాజు,కోశాధికారి మామిళ్ల నాగరాజు, జోన్ చైర్మన్ చంద్రమోహన్, జిల్లా క్యాబినెట్ సభ్యులు భవిరిశెట్టి శ్రీకాంత్, ఎం.పీ.వి. రమణయ్య, సీనియర్ సభ్యులు నిజాముద్దీన్, మేడా చంద్రశేఖర్, పురస్కార గ్రహీత సాయి చందన్ తల్లి కృష్ణప్రియ పాల్గొన్నారు. **పాణ్యం :** మండలంలో జాతీయ యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆర్జీఎం, శాంతిరాం, ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపాల్‌ల ఆధ్వర్యంలో వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయచంద్ర ప్రసాద్ డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ మధుసూదన్ శెట్టి, డీన్ డాక్టర్ అశోక్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. **పాములపాడు:** పాములపాడులోని వివేకానంద విద్యా విహార్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పాఠశాల కరస్పాండెంట్ ఆర్ఎస్ ఆర్ గోపాల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ దేవిక మాట్లాడుతూ యువతీ యువకులు స్వామి వివేకానంద సూక్తులను ఆయనను మార్గదర్శకంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం



విజేతలతో ఎంపిడిఒ తదితరులు

'ఆడుదాం ఆంధ్ర' డివిజన్ స్థాయి పోటీలకు జట్లు ఎంపిక

ప్రజాశక్తి - పాములపాడు

'ఆడుదాం ఆంధ్ర' మండలస్థాయి పోటీలలో విజేతలుగా నిలిచి డివిజన్ స్థాయికి ఎంపికైన జట్ల వివరాలను ఎంపీడీవో గోపికృష్ణ వెల్లడించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభు త్వం నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' వివిధ గ్రామాల నుండి మండల స్థాయికి ఎంపికైన వారు పాములపాడు జడ్పీహెచ్ ఆవరణంలో గత రెండు రోజులుగా క్రీడలు నిర్వహించడం జరిగిందన్నారు. మండల స్థాయి విజేతలుగా కబడ్డీ మిట్ట కందల గ్రామం నుండి, ఖోఖో ఇస్కాల గ్రామం నుండి, బ్యాడ్మింటన్ ఎర్ర గూడూరు గ్రామం నుండి, వాలీబాల్ జూటూరు 2 (తుమ్మలూరు) గ్రామాల నుండి విజేతలుగా జట్లు నిలిచాయన్నారు. విజేతలుగా నిలిచిన వారు డివిజన్ స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారని తెలిపారు. క్రికెట్ ఇంకా సెమీస్ జరుగుతో ందని 17న క్రికెట్ టీం విజేతను ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 సుభాషిని, ఫిజికల్ డైరెక్టర్లు సాయి కృష్ణ, నాగరాజు, రాజశేఖర్, సుమలత, కళ్యాణి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వార్డు ప్రజల సేవలే లక్ష్యం

- 30 వార్డ్ కౌన్సిలర్ ఆర్ట్ రమణ

ప్రజాశక్తి-డోన్

వార్డులో ప్రజలకు సేవలు అందించడమే తమ లక్ష్యమని 30 వార్డ్ కౌన్సిలర్ ఆర్ట్ రమణ అన్నారు. శుక్రవారం డోన్ పట్టణంలోని ప్రజా వైద్యశాల సందులో ఉన్న ఇందిరానగర్‌కు చెందిన 16 వ సచివాలయంలో ఇటీవల మృతి చెందిన కమలామణి భర్తకు సంబంధించి వైయస్సార్ బీమా కింద లక్ష రూపాయలు 30 వార్డ్ కౌన్సిలర్ ఆర్ట్ రమణ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా 30 వార్డ్ కౌన్సిలర్ ఆర్ట్ రమణ మాట్లాడుతూ వార్డులో ఉన్న ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ కృషి చేస్తున్నామన్నారు. సచివాలయంలో పనిచేస్తున్న వెల్ఫేర్ సెక్రెటరీ ఆర్.అలివేలి, వాలంటీర్ వి.ఈశ్వరి ఇద్దరు కలిసి వైయస్సార్ బీమా అందించడంలో ఎంతో కృషి చేశారని అభినందనీయమన్నారు. మహిళా పోలీస్ ఎన్.కిరణ్మయి, వార్డ్ హెల్త్ సెక్రటరీ సి.రామేశ్వరి, సచివాలయం సిబ్బంది వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



కమలామణికి లక్ష రూపాయలు అందిస్తున్న 30 వార్డ్ కౌన్సిలర్ ఆర్ట్ రమణ

'డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి సేవలు ప్రశంసనీయం'

ప్రజాశక్తి-డోన్



డి.ఎస్.పి శ్రీనివాస్ రెడ్డి దంపతులను సన్మానిస్తున్న డోన్ తాలూకా వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షులు ఏఈ నాగరాజు

డోన్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి సేవలు ప్రశంసనీయమని డోన్ తాలూకా వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షులు ఏఈ నాగరాజు అన్నారు. శుక్రవారం డోన్ పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో స్వామి వివేకానంద 161వ జయంతి సందర్భంగా డోన్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి, ఆయన సతీమణి ఝాన్సీ లక్ష్మి దంపతులను ఘనంగా సన్మానించి, స్వామి వివేకానంద,ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటాలను అందజేశారు. ఈ సందర్భంగా వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షులు ఏఈ నాగరాజు మాట్లాడుతూ డోన్ డివిజన్ స్థాయిలో డిఎస్పి శ్రీనివాసరెడ్డి వచ్చిన తర్వాత ఫ్రాక్షన్ తగాదాలు గలాటాలు,కొట్లాటలు ఫ్యాక్షనిజం వంటివి రూపుమాపారన్నారు. అంతేకాకుండా పోలీసులు పార్టీలకు అతీతంగా ప్రజలకు పౌరులకు రక్షణ కల్పిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతుండడం అభినందనీయం అన్నారు. డి.ఎస్.పి సతీమణి ఝాన్సీ లక్ష్మీ కార్తీకమాసం సందర్భంగా అంబేద్కర్ విగ్రహం దగ్గర అన్నదాన కార్యక్రమం ప్రజలకు అందజేస్తూ స్వయంగా సేవా కార్యక్రమాలను చేపట్టారని కొనియాడారు. డీఎస్పీ శ్రీనివాస రెడ్డి సేవలు నంద్యాల జిల్లా కే ఆదర్శంగా నిలిచాయని ప్రజలకు పారదర్శ కంగా సేవా కార్యక్రమాలు ప్రజారక్షణ కల్పించడంలో ఆయనకు తోడు గా డోన్ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్,డోన్ టౌన్ ఎస్సై శరత్ కుమార్ రెడ్డి పోలీసు అధికారులు అందరూ ప్రజలకు పరిరక్షణ కల్పించడంలో వారి సేవలు ప్రశంసనీయమని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెడ్మాస్టర్ సుబ్బరాయుడు,రోటరీ క్లబ్ మాజీ సెక్రెటరీ జి రాజయ్య గౌడ్ వినియోగదారుల సంఘం గౌరవాధ్యక్షులు మల్లికార్జునస్వామి తదితరులు పాల్గొన్నారు.

బేతంచర్ల అభివృద్ధికి కృషి

- ఎంపీపీ బుగ్గన నాగభూషణ్ రెడ్డి, చైర్మన్ చలం రెడ్డి

ప్రజాశక్తి - బేతంచర్ల

బేతంచెర్ల పట్టణం అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేయడం జరుగుతుందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. బేతంచర్ల పట్టణంలో దుర్గపేట కాలనీ బోయపేట,బిఆర్ పేట, ఉప్పు నీళ్ల బావి బలపాలపల్లి రోడ్డు లోని సిద్ధప్ప గుడి ఆలయం ప్రాంతం తదితర వీధులలో బీటీ రోడ్డు వేస్తున్న సందర్భంగా, అల్ల ప్రకాష్ దర్గా కందకం సమీపంలో సుమారు రూ.3.70 కోట్లతో నిర్మిస్తున్న కందకం డ్రైనేజీ పనులను ఎంపీపీ నాగభూషణం రెడ్డి, చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు పరిశీలించారు. అనంతరం బల్బలపల్లె గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కొరకు నూతనంగా ఏర్పాటు చేసిన తాగు నీటి బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన రీతిలో నిర్మాణ పనులను వేగవంతం చేసి ప్రజలకు అన్ని విధాలుగా సౌకర్యం కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్ర మంలో బుగ్గల భాస్కర్ రెడ్డి ,మన్మోహన్ రెడ్డి, కుంచే తిరుమలేశ్వర్ రెడ్డి, ఎద్దులన్న , మద్దిలేటి స్వామి చైర్మన్ సీతారామ చంద్రుడు,వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



బలపాలపల్లిలో తాగునీటి బోరును ప్రారంభిస్తున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి


భారీగా టిడిపిలో చేరిక



మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సమక్షంలో టిడిపిలో చేరిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని తోడేళ్లపల్లె గ్రామానికి చెందిన 30 వైసిపి కుటుంబాలు మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సమక్షంలో శుక్రవారం టిడిపిలో చేరాయి. తొలుత గ్రామానికి చేరుకున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ,ఆళ్లగడ్డ యువ నాయకులు విఖ్యాత్‌రెడ్డి, భార్గవరామ్‌లకు పెద్ద ఎత్తున గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం గ్రామ ఉపసర్పంచ్ శ్రీనివాసులు, నరహరి,రమణలతో సహా మరో 30 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి విజయానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి,టిడిపి మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్సర్ బాషా,కొలిమి హుసేన్‌వళి,కొలిమి మాబు షరీఫ్, ముల్లా అజీమ్ మద్దూర్ మాబూలాల్ , ఖలీల్, ముల్లగఫార్ ,ముల్లా షాబుల్, నాగూర్ బాష, కొలిమి హుస్సేన్ పీరా, కొలిమి సదాఫ్ ,హర్షద్ టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గుత్తి నర్సింహులు, సల్లా నాగరాజు, హుసేన్ రెడ్డి,సంజీవరెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,ఇండ్ల లక్ష్మిరెడ్డి, రమణారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి,సుబ్రమాణ్యం, బ్రహ్మం,సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** కొలిమిగుండ్ల గ్రామానికి 40 కుటుంబాలు తోకల నడిమి మద్దయ్య, వైసీపీ 5వ వార్డు నెంబర్ రాజినేని రాము కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి. శుక్రవారం కొలిమిగుండ్లలో జరిగిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా పాల్గొన్న బీసీ జనార్ధన్ రెడ్డి పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని ప్రజలక్షేమం, సంతోషాలు గాలికి వదిలేసి ఒక నియంతలా ప్రవర్తిస్తున్నాడని అన్నారు. అనంతరం 6 భవిష్యత్తు గ్యారంటి పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు. టీడీపీ నాయకులు ఐ వి పకీర రెడ్డి కొలిమిగుండ్ల మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి, కే కృష్ణ, రంగారెడ్డి, కే భాస్కర్ రెడ్డి, అందె రాముడు, నాగార్జున రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీసీ జనార్దన్ రెడ్డి

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి : ఎడిఎ



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఏడిఏ ఆంజనేయులు

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు మండలంలోని స్థానిక రైతు భరోసా కేంద్రం నందు మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు ఆత్మకూరు బి ఆంజనేయ మాట్లాడుతూ ప్రతి రైతు తప్ప నిసరిగా రబి సీజన్లో వేసిన పంటను ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత పంటలపై సస్యరక్షణ చర్యల గురించి తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా అడ్వైజర్ బోర్డ్ మెంబర్ డి రాజమోహన్ రెడ్డి, ఆత్మకూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ బాలస్వామి, ఆత్మకూరు అర్బన్ వ్యవసాయ మండలి చైర్మన్ బైరాపురం మహబూబ్ బాషా, సంబంధిత అధికారులు సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -రుద్రవరం

గ్రామాలలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను అందరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి అమర్నాథ్ రెడ్డి తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిత్రేనిపల్లె గ్రామంలో శుక్రవారం గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 110 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామని 15 మంది గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించామని వైద్యాధికారి తెలిపారు.



కార్యక్రమంలో వైద్య సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

పాణ్యంలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - పాణ్యం

మండలంలో అమరులైన కబడ్డీ క్రీడాకారుల జ్ఞాపకార్థం, సంక్రాంతి పండగ సందర్భంగా పురుషుల జిల్లా స్థాయి, మహిళల జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నవోదయ ఆర్గనైజింగ్ కమిటీ, మానవతా సేవా సంస్థ సభ్యులు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ కబడ్డీ విజేతలకు అందించే అన్ని రకాల బహుమతుల విలువ దాదాపుగా మూడు లక్షల వరకు వుంటుందన్నారు. ఉచిత వసతి, ఉచిత భోజనం సదుపాయం క్రీడా కారులకు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 13,14వ తేదీలలో పాణ్యం పాఠశాల ఉన్నత మైదానం లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళల విజేత జట్టుకు జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారుడు చింతల నాగ గోపి, వారి కుటుంబ సభ్యులు చింతల లక్ష్మీ దేవి జ్ఞాపకార్థం ప్రైజ్ మనీ, షీల్డ్ అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సర్వసభ్య సమావేశానికి అధికారుల గైర్హాజరు

ప్రజాశక్తి - వెలుగోడు

వెలుగోడు సర్వసభ్య సమావేశం తహశీల్దార్ (ఎంఆర్ఓ)తో పాటు పోలీసు అటవీ శాఖ అధికారులు రాకున్నా, ఎంపీడీవో అమానుల్లా హుడా విడిగా బయటికి వెళ్లిపోయిన సర్వసభ సమావేశాన్ని సజావుగా సాగనంపారు. ఎంపీపీ లాలం రమేష్, శుక్రవారం ఈ సమావేశంలో మొదటి ఉప ఎంపీపీ నసీరుద్దీన్ (చికెన్ బాబు) ఆగ్రహానికి గురై ఇలా అన్నారు. గతంలో జరిగిన సమావేశంలో ఏమి అభివృద్ధి పనులు జరిగాయో ? ఏవి జరగలేదో ఇక్కడ హాజరైన వారిలో ఎంతమందికి తెలుసునని వాపోయారు. సర్వసభ్య సమావేశానికి అధికారులు రారు, ప్రజా ప్రతినిధులు కొంత మంది రారని, సర్వసభ్య సమావేశానికి రాని వారికి ఎటువంటి నోటీసులు పంపారని అన్నారు. ఇక ప్రతిపక్షం లేనే లేదని



ఎం పి పి లాలం రమేష్ తో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ పకీరయ్య

తెలిపారు. కాలయాపన తప్ప అధికారుల నుండి స్పందన కరువైందని అన్నారు. ఇటువంటి ధోరణికి ఇకనైనా స్వస్తి చెప్పి ఇకముందునైనా మార్పు రావాలని ఆయన కోరారు. మండలంలో సమస్యలు లేనే లేవనే విధంగా అధికారులు పొంతన లేని సమాధానాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



బ్రహ్మానంద ఆచారిని సన్మానిస్తున్న దృశ్యం

బ్రహ్మానందచారికి వివేకానంద లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జెఎస్ఎస్ బ్రహ్మానంద చారికి పొద్దుటూరు పట్టణా నికి చెందిన మనం ఫౌండేషన్ అధ్యక్షుడు లాయర్ చక్రవర్తి స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని బ్రహ్మానంద చారికి స్వామి వివేకానంద లైఫ్ టైం అచీస్మెంట్ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బాల సరస్వతి భజన మండలి అధ్యక్షుడు బాల హను మంతు, ఉపాధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో బ్రహ్మానంద చారిని సన్మానిం చారు. ఈ సందర్భంగా బ్రహ్మందచారి మాట్లాడుతూ యువతకు స్ఫూర్తి దాయకమైన స్వామి వివేకానంద పురస్కారం రావడం సంతోషమని తెలిపారు. ఇప్పటివరకు జెకెఆర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రజల విద్య, ఆరోగ్య చైతన్యానికి సంబంధించి 985 సేవా కార్యక్రమాలు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ స్ఫూర్తితో అనేక సేవా కార్యక్రమాలు చేస్తానని తెలిపారు. బాల హనుమంతు, రాజు, రవి, భాస్కర్, సుధాకర్, లక్ష్మన్న, దస్తగిరి పాల్గొన్నారు.

రైతులు పంట నమోదు చేసుకోవాలి : ఎఒ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రైతులు తాము సాగుచేసిన పంటలను ఈ-పంట నందు నమోదు చేసుకోవాలని ఏవో కె.సునీత తెలిపారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం దొర్నిపాడు మండలంలోని దొర్నిపాడు రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం మండలస్థాయి సలహా కమిటీ సమావేశం చైర్మన్ భూమా చెంచిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఏ.ఓ సునీత మాట్లాడుతూ రబీ సీజన్ లో సాగుచేసిన పంటలను రైతులు తప్పని సరిగా ఈ-పంట నందు నమోదు చేసుకోవాలని సూచించారు. జొన్న పంట వేసిన రైతులు మద్దతు ధరకి అమ్ముకోవాలంటే మీ గ్రామంలో గల రైతు భరోసా కేంద్రం నందు ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏవో సునీత

మీటింగ్ ఉందని వైసిపిలో చేరారనడం సిగ్గుచేటు : టిడిపి

ప్రజాశక్తి - ప్యాపిలి

మండలంలోని ఎస్.రంగాపురం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలను మీటింగ్ ఉందని పిలిచి వైసిపి కండువాలని కప్పి పార్టీలో చేరినట్లు ప్రకటించడం సిగ్గుచేటని మండల టిడిపి అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ మాయమాటలు చెప్పి పార్టీ కండువాలు కప్పడం నీచమైన చర్య అని విమర్శించారు. తిరిగి పార్టీలో చేరిన వారు జయప్రసాద్, మాజీ సర్పంచ్ రామాంజనేయులు, పరదేశి రామంజి, రవికుమార్,రాజశేఖర్, రంగస్వామి నాగన్న, రాముడు, చిన్న పెద్దయ్య, మోహన్,నాగేశ్వరరావు, రమేస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు జిందాల్ ఫ్యాక్టరీ రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి

- విద్యార్థి సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - గడివేముల

జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ వాహనాలతో మృతి చెందిన కుటుంబాలకు రూ. 50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం నాడు గడివేములలో జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేఖంగా రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల నేతలు భారీ ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రాయ లసీమ విద్యార్థి , యువజన సంఘాల జేఏసీ చైర్మన్ రాజు నాయుడు, కన్వీనర్లు తెలుగు రవీంద్రనాథ్, శేక్ రియాజ్, ముద్దం నాగనవీన్, నేతలు నాగ సుంకన్న, తెలుగు మహేష్, తదితరులు మాట్లాడారు. గురువారం గడివేములలో జిందాల్ ఫ్యాక్టరీ లారీ ఢీకొని మహిళ మృతి చెందిందని, గతంలోనూ భారీ వాహనాల ద్వారా మృతి చెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికీ 50 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. గడివేములలో భారీ వాహనాలు తిరిగితే సహించేది లేదనీ, గడివేముల యువతకు, ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేని రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీని మూసివేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఐ బీటీ వెంకట సుబ్బయ్యకు , ఎమ్మార్వోకు వినతి పత్రాన్ని అందజేశారు.